అప్పుచేసి చూడు!

వసుంధర

"ప్రపంచంలో దేన్నైనా భరించవచ్చును కానీ ఆకలిని భరించలేం—ఏమంటావ్?" అన్నాడు శాస్త్రి.

ఆతను వెల్లకిలా చాపమీద పడుకుని గది పైభాగాన్ని చూస్తున్నాడు.

"ఈ మాట ఎన్ని సార్లు చెబుతావ్? ఆకలినైనా భరించవచ్చును కానీ ఒకే మాట పదే పదే వినడం మరీ కష్టమనిపిస్తోంది నాకు. ఇంకోసారి ఇదేమాట చెప్పావంటే మనిద్దరం ఫైటింగ్ ప్రారంభించాల్సి వుంటుంది" అన్నాడు శర్మ.

"అందుకు మాత్రం ఓపిక కక్కదేసిందీ—ఆకలితో చస్తూంటే! అనగా అనగా నీకు పౌరుషం వచ్చి ఏదో ఉపాయం చెబుతావేమోనని ప్రయత్నిస్తున్నాను. నీకోపం వస్తోంది తప్పితే ఉపాయం తట్టలేదు—" అన్నాడు శాస్త్రి.

"నీకు తట్టని ఉపాయాలు నాకుమాత్రం తడతాయా!

ఇప్పటికి భోంచేసి మూడు పూటలైంది. ఇంకా ఇలా ఎన్నాళ్ళు మాడిపోతాం? జేబులో ఒక్క పైసా కూడా లేదు. గదిదాటి బైటకు వెడదామంటే అప్పులు...." అన్నాడు శర్మ.

శాస్త్రి ఉన్నట్టుండి లేచికూర్చుని—"విన్నావా.... అడుగుల చప్పుడు...." అన్నాడు.

"అప్పులవాళ్ళనగానే నీ కలాగే అనిపిస్తుంది. నాకే అడుగుల చప్పుడూ వినిపించడంలేదు—"

"నాకు అంతా స్పష్టంగా వినబడుతూంటే నీకెందుకు వినబడదు? బహుశా నీరసంతో నీకు చెవులు గళ్ళడి వుంటాయి. అదిగో—అడుగుల చప్పుడు తలుపును సమీపించింది...." అని శాస్త్రి ఇంకా ఏదో అనబోతూండగా తలుపు తట్టిన చప్పుడైంది. శర్మ ఉలిక్కిపడి లేచి నిలబడి "నువ్వు చెప్పింది నిజమే!" అన్నాడు.

"మనింటికి అప్పులవాళ్ళు తప్ప రారు. ఇప్పుడేం చేయాలి? అసలే ఆకలితో చచ్చిపోతూంటే ఈ అప్పులవాళ్ళ బెడద ఒకటి! ఈ గదికి వున్నదొక్కటే తలుపు. ఆ తలుపు దగ్గర అప్పులాడు..ఏమిటి చేయడం?" అని శాస్త్రి వాపోతూంటే అతడితోపాటు శర్మ కూడా వాపోసాగాడు. ఈ లోగా మరోసారి తలుపు చప్పుడయింది.

"నాతోపాటూ నువ్వూ గోలెట్టేబదులు — వెళ్ళి తలుపుతీసి సమాధానపర్చరాదూ!" అన్నాడు శాస్త్రి.

"నీకైతే దూరంనుంచి అడుగుల చప్పుళ్ళు కూడా వినపడుతున్నాయి. నాకంటే నీ పరిసితే మెరుగ్గావుంది కాబట్టి ఆ వచ్చినవాడిని నువ్వే సమాధానపర్చాలి...." అంటూ చతికిలబడిపోయాడు శర్మ. ఈలోగా తలుపు

మళ్ళీ తట్టిన చప్పుడయింది. శాస్త్రి విసుక్కుంటూ లేచి నిలబడి శర్మను పడుకోమని కనుసైగ చేసి—"అబ్బబ్బ—కష్టం నాకుండదండయ్యా — ఏమిటీ — అదే పనిగా బాదుతారు...." అంటూ వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగా నవ్వుతూ ఇంటాయన కనిపించాడు.

"మిమ్మల్ని నవ్వుతూండగా చూసి చాలా కాలమయింది సార్—రండి—రండి—లోపలికి—" అంటూ ఆయన్ను సాదరంగా ఆహ్వానించాడు శాస్త్రి లోపలకు. ఆయన ఇంకా నవ్వుతూనే లోపలకు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"మీరింకా నవ్వుతూనే వున్నారు. నాకెంతో సంతోషంగా వుందిసార్. మీరెప్పుడూ ఇలా నవ్వుతూనే వుండాలని నా కోరిక. అవును కానీ—నవ్వేదాకా తెలియలేదు—మీరెంతో అందంగా వుంటారని...." అంటూ శర్మ పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు. శాస్త్రి మాత్రం ఆయన లోపలకు ప్రవేశించగానే వీధి తలుపువేపి "వామ్మయ్య!" అనుకున్నాడు.

ఇంటాయన వాళ్ళిద్దరివంక ఆప్యాయంగా చూసి—"చాకల్లాంటి కుర్రాళ్ళయ్యా మీరు! అలా వాడలిపోయారేమిటి? మీ దగ్గర డబ్బుల్లేవా?" అన్నాడు.

శాస్త్రి, శర్మ ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకున్నారు. ఇంటాయనకి అద్దె ఇచ్చి మూడు నెలలైంది. వచ్చినప్పుడల్లా మొహం చెండుకొని వెడుతున్నాడు. తమ నెప్పుడూ ఆయన ఆప్యాయంగా పలకరించిన పాపాన పోలేదు.

"ఏం—బాబూ—మీ దగ్గర డబ్బుల్లేవా?" అన్నాడు ఇంటాయన.

"లేదండి. ఆఖరికి చేతివాచీలు కూడా అమ్మేశాం! భోంచేసి మూడు పూటలైంది!" అన్నారు మిత్రులిద్దరూ ఏక కంఠంలో. అప్పులవాళ్ళ దగ్గర మానాభిమానాల సంగతి మర్చిపోవాలని వాళ్ళు ఎప్పుడో తెలుసుకున్నారు.

"అయ్యో—ఎంతమాట....ముందు వెళ్ళి భోంచేసి రండి...." అన్నాడు ఇంటాయన జేబులోకి చెయ్యి పెడుతూ. శాస్త్రి, శర్మ ఆయన జేబువంకే చూస్తున్నారు ఆత్రుతగా. అందులోంచి పదిరూపాయల నోటొకటి బైటకు వచ్చింది. అయితే మిత్రులిద్దరూ ఆయన్ను సమీపించలేదు.

"డబ్బు తీసుకోరా?" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"మాకో ఇబ్బంది ఉందండి. చుట్టుపక్కల చాలా అప్పులు చేసేశామండి. ఈ పదిరూపాయలతో వీధిలో కనబడ్డామంటే ఎవడో ఒకడు మా దగ్గర్నుంచి లాగేసుకుంటాడు. ఇదీ మా యిబ్బంది. దయతో మీరే మాకు అన్నం తెచ్చి పెట్టాలి. ఇలా అంటున్నామని ఏమీ అనుకోవద్దు—...." అన్నాడు శాస్త్రి.

"భలేవాళ్ళయ్యా మీరు....బోలెడు సంపాదిస్తారు కదా—అంతా ఏంచేసేస్తారు?" అన్నాడు ఇంటాయన.

"మా సంగతి మీకు తెలియనిది ఏముంది సార్! రేపు గురించి ఆలోచించం. వున్నప్పుడు అడిగినవాడికి లేదనకుండా దానాలిచ్చేస్తాం. అలాగే లేనప్పుడు వున్నవాళ్ళనడిగి తీసుకుంటాం. దురదృష్టమేమిటంటే మేమిచ్చిందల్లా దానమైపోతోంది. పుచ్చుకొన్నదల్లా అప్పయిపోతోంది" అన్నాడు శర్మ.

"అయినా మీరు దానాలు మానేసి—అప్పులెందుకు తీర్చరూ?" అన్నాడు ఇంటాయన.

"సమాధానం చెప్పాలంటే ఆకలి....ఆకలితీరితేకానీ ఏమీ చెప్పలేం...." అన్నాడు శాస్త్రి.

ఇంటాయన మారుమాట్లాడకుండా బైటకు వెళ్ళి—కాసేపటికి ఓ క్యారియరు తీసుకుని వచ్చాడు. మిత్రులిద్దరూ ఆవురావురుమంటూ భోంచేసి—"అన్నదాతా—సుఖీభవ!" అన్నారు.

"కడుపు నిండిందా?" అన్నాడు ఇంటాయన.

"ఆహాహా....గృహ యజమానులంటే మీకులాగా వుండాలి. మూణ్నెల్లనుంచి అద్దె అడగడంలేదు. పైగా ఈ రోజు కడుపునిండా భోజనం పెట్టారు...." అంటూ శర్మ ఆయన్ను మెచ్చుకున్నాడు.

"అవునుసార్—రోజు మీరు మాకిలాగే క్యారియర్ ఎందుకు పంపకూడదు?" అన్నాడు శాస్త్రి.

"నేనడిగిన ప్రశ్నకింకా జవాబు చెప్పలేదు! మీరు అప్పులు తీర్చక దానాలెందుకు చేస్తారు?"

శాస్త్రి నవ్వి—"జవాబడక్కండి సార్—అది మీకు నచ్చదు. అందుకే భోజనానికిముందు మీరడిగితే భోంచేసి గానీ చెప్పలేమన్నాను. ఎందుకంటే జవాబు వింటే మీరు భోజనం పెట్టరు...." అన్నాడు.

"ఫరవాలేదు. ఈ రోజు నేను చాలా శాంతంగా వున్నాను. అదీకాక మీరు భోంచేయడం కూడా అయిపోయింది—"

"అదికాదు సార్—అన్నంపెట్టినవారి మనసు కష్టపెట్టడం నాకిష్టంలేదు...." అన్నాడు శాస్త్రి.

"ఫరవాలేదు—చెప్పు!" అన్నాడు ఇంటాయన.

"అవసరంలో వున్నవాళ్ళనీ, లేనివాళ్ళనీ ఆదుకోవడం మా అలవాటు సార్! వళ్ళు వాచిన వాళ్ళంటే మాకు

వు పేక్షా భావం. అప్పులు తీర్చొచ్చులే అనుకునేలోగా డబ్బు మరో రకంగా అయిపోతుంది. అయినా ఈ లోకంలో వచ్చేవాచిన వాళ్ళకంటె — అవసరాలతో బాధపడేవాళ్ళే ఎక్కువ సార్! అలాంటప్పుడు కనీసం మాబోటి కొందరైనా వాళ్ళకి సపోర్టివ్వకపోతే ఎలా చెప్పండి!" అన్నాడు శాస్త్రి.

"అలా అయితే మాబోటివాళ్ళ గతేమిటి? మీలాంటి వాళ్ళకు తినే ఇల్లద్దెకివ్వాలా?" అన్నాడు ఇంటాయన.

"లేదు సార్! కానీ మీరే న్యాయం చెప్పండి. మేం మీకు మూడు నెల్ల అద్దె బకాయి. అయినా మీకొచ్చిన నష్టమేమిటి? పైగా మాకు భోజనం కూడా తెచ్చిపెట్టారు...." అన్నాడు శర్మ.

"మీ సమాధానం నాకు నచ్చింది. నా మనసు ఎంత మాత్రమూ కష్టపడలేదు—" అన్నాడు ఇంటాయన.

"చాలా థాంక్స్ సార్...." అన్నాడు శాస్త్రి.

"మరి నేను వచ్చిన పని చెబుతాను. మీరూ కాదన కూడదు...." అన్నాడు ఇంటాయన.

శాస్త్రి, శర్మ ముఖముఖాలు చూసుకున్నారు. ఇంటాయన ఔదార్యం వెనుక ఏదో పెద్ద కథే వుండాలని ఇద్దరూ అనుకుంటూనే వున్నారు-"చెప్పండి!" అన్నాడు శాస్త్రి.

"విశాఖపట్నంలో అప్పారావు తెలుసా?" అన అడిగాడు ఇంటాయన.

"విశాఖపట్నం ఎల్లమ్మతోట సెంటర్లో నిలబడి ఓసారి అప్పారావ్ అని కేకపెట్టాను. అంతే ఒక్కసారిగా ఎన్నో కార్లకు, బస్సులకు, స్కూటర్లకు, బ్రేకులు పడ్డాయి. ఎందరో మనుషులు ఆగిపోయారు,

ట్రాఫిక్ సంభించిపోయింది. ఏమిటీ వింతపరిణామం అని నేను వెర్రి మొహం వేసుకుని చూస్తూండగా ట్రాఫిక్ పోలీసు నా దగ్గరకు పరుగునవచ్చాడు. అతగాడికేం సమాధానం చెప్పాలా అని నేను మాడలి చస్తూండగా అతను వినయంగా-"సార్—మీరు పిలిచింది నన్నేనా?" అన్నాడు. అలాంటి విశాఖపట్నంలో ఓ అప్పారావు గురించి అడిగితే నేనేం చెప్పను?" అన్నాడు శాస్త్రి.

శర్మ నవ్వాడు కానీ ఇంటాయన నవ్వలేదు. ఆయన అదోలా శాస్త్రి వంక చూసి—"ఇదిప్పటి జోకు కాదు. మీ పెద్దాళ్ళెవరో చెబితే విని నువ్వు నాకు చెబుతున్నావు. విశాఖపట్నం అప్పటికీ ఇప్పటికీ మారింది. నువ్వు చెప్పే ఎల్లమ్మతోట సెంటర్ అంత పాప్యులర్ కాదు. ఇప్పుడు అక్కడికి కాస్త దగ్గర్లోనే వున్న జగదాంబా సెంటర్ పాప్యులర్! జగదాంబా సెంటర్ దగ్గర నువ్వు అప్పారావ్ అని కేక పెడితే—ఆ కేక నీకే వినపడనంత గొడవగా వుంటుందక్కడ. కాబట్టి అలాంటి బెంగలేమీ పెట్టుకోకు. నేను చెప్పే అప్పారావు గురించి కాస్త విను...." అన్నాడు.

"ఈ రోజు మీరు చాలా తెలివిగా మాట్లాడుతున్నారు సార్! మాకు భోజనం పెట్టారు. ఆ ఫలితం ఊరికేపోలేదుగదా..." అన్నాడు శాస్త్రి. అప్పటికీ ఇంటాయన కోపగించుకోకుండా మనస్ఫూర్తిగా నవ్వాడు.

"మరీ అంతలా నవ్వేయకండి సార్. నాకు భయం వేస్తోంది. కాస్త కోపంగా చూడండి-" అన్నాడు శర్మ.

"అప్పారావు హిందీ సినిమాలో 'శెట్టి'లాగుంటాడు. చాలామందికి అతడంటే భయం. నాక్కూడా భయమే!" అని ఆగాడు ఇంటాయన.

"మీరేమీ అనుకోనంటే ఒక్క ప్రశ్న సార్! ఈ ప్రపంచంలో మీరు భయపడని మనిషి ఎవరైనా వున్నారండీ?" అని ఆగి—"మీరు ఆ అప్పారావులాంటి వాళ్ళతో గొడవ పెట్టుకోకండి సార్!" అన్నాడు శాస్త్రి.

"మధ్యలో నన్ను డిస్టర్బ్ చెయ్యవద్దు" అన్నాడు ఇంటాయన - "అప్పారావు నా దగ్గర పాతిక వేలు అప్పు తీసుకున్నాడు. ఇప్పటికి రెండేళ్ళయింది. తిరిగి ఇమ్మంటే యివ్వడం లేదు. అప్పు తిరిగివ్వడం వాళ్ళింటా వంటా లేదన్నాడు."

"పాపం నిజమే నేమో-ఇంటా వంటా లేని పని చేయడానికెవరు మాత్రం ఇష్టపడతారు" అన్నాడు శాస్త్రి.

ఇంటాయన అతడివంక కోపంగా చూసి—"మీరు నాకు మూడు నెల్ల అద్దె బాకీ వున్నారు. ఇప్పుడు నా భోజనం తిన్నారు. ఇంకా నా శత్రువు నే సమర్థిస్తున్నారు. నన్ను వేళాకోళం చేస్తున్నారు. ఇది మర్యాదగా వుందా?" అన్నాడు.

"ఏంచేస్తే మర్యాదగా వుంటుందో మీరే చెప్పండి" అన్నాడు శర్మ.

"అప్పారావు దగ్గర బాకీవసూలు చేసి తీసుకురండి. అందులో అయిదు వేలు మీకిస్తాను...."

శాస్త్రి, శర్మ లేచి నిలబడ్డారు—"ఓ.కే—ముందుగా అడ్వాన్సిస్తారా?"

"నాకు దొరికేవన్నీ మీలాంటి బేరాలే అయితే—అడ్వాన్సివ్వడానికి డబ్బు లెక్క దేముస్తాయి? ఇప్పుడు మీకు పెట్టిన భోజనమే అడ్వాన్సనుకోండి. మీరు ఘటనాఘటన సమర్థులని తెలిసింది. అందుకే ఈ పని

మీకు అప్పగిస్తున్నాను. డబ్బు తీసుకురాగానే మీకు వెంటనే అన్న మొత్తం ఇచ్చేస్తాను...."

"పోనీ ప్రయాణం ఖర్చులు...."

"టికెట్ లేకుండా ప్రయాణం చేయగలరని మీ గురించి నాకు తెలును...." అన్నాడు ఇంటాయన.

"గురూ—ఈయన దగ్గర్నుంచి మనకింకేమీ గిట్టదు. అయిదు వేలంటే మాటలుకాదు. అప్పులన్నీ తీరిపోగా ఇంకా రెండు వేలకు పైగా మిగుల్తుంది—" అన్నాడు శర్మ.

2

"నమస్కారమండీ—నా పేరు శాస్త్రి!" అన్నాడు శాస్త్రి.

"నా పేరు శర్మ!" అన్నాడు శర్మ.

"మా యింట్లో ప్రస్తుతం శుభకార్యాలూ, అశుభ కార్యాలూ కూడా లేవు ..." అన్నాడతను.

"మీ పేరు అప్పారావుగారే కదండీ—" అన్నాడు శర్మ.

"మా అమ్మా నాన్నలకూ, నాకంటే పెద్దలకూ నా పేరు అప్పారావు. నా కాలికింది తొత్తులకూ, నా మోచేతి నీళ్ళు తాగేవాళ్ళకూ నా పేరు అప్పారావుగారు—" అన్నాడతను.

"అయితే నేను నిన్ను అప్పారావు అనే పిలుస్తాను" అన్నాడు శాస్త్రి.

అప్పారావు కోపంగా శాస్త్రివంక చూసి నెమ్మదిగా చొక్కా విప్పాడు. కుర్చీమీద వేశాడు. ఓసారి కుర్చీ లోంచి లేచి నిలబడి కండలు పొంగించి—"మరోసారి నన్ను అప్పారావూ అను...." అన్నాడు.

శాస్త్రి నవ్వి "నువ్వు కాబరే డ్యాన్సులకి బాగా పనికొస్తావు. నువ్వు చొక్కా విప్పిన పద్ధతీ, నీ కండలు కూడా చాలా బాగున్నాయి. దురదృష్టమేమిటంటే ఇది ఇండియా అయిపోయింది. ఇక్కడ మగ డ్యాన్సర్లకంత డిమాండు లేదు—" అన్నాడు.

అప్పారావు ఆవేశంగా కండలు కదిలించి—"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అన్నాడు.

"నీ గురించి చెప్పుకోవడమే కానీ నువ్వు మా గురించి అడగవేం?" అన్నాడు శర్మ.

"అడ్డమైన వాళ్ళ గురించీ వాకబు చెయ్యడం నాకసహ్యం—" అన్నాడు అప్పారావు.

"అలాంటి పని మాకూ అసహ్యమే. అయినా మీ గురించి వాకబు చెయ్యక తప్పలేదు. నువ్వు ఎవరెవరికి ఎంతెంత బాకీలున్నావో తెలుసుకుని వాళ్ళందరి బాకీలూ తీర్పించాలని వచ్చాం—" అన్నాడు శాస్త్రి.

"నా చేత బాకీలు తీర్పిస్తారా? నేనసలు ఎప్పుడైనా ఎవరి దగ్గరైనా అప్పుచేస్తేకదా!"

"నువ్వు అప్పుచెయ్యలేదూ?" అన్నాడు శాస్త్రి.

"అప్పు చెయ్యాల్సిన అవసరం నాకేమిటి? నన్ను చూడండి, నా యిల్లు చూడండి, నా వైభవం చూడండి...."

"నిన్ను తప్ప మిగతావి చూడ్డానికి మాకేం అభ్యంతరంలేదు కానీ నువ్వు అప్పుచెయ్యలేదనడానికి సాక్ష్యమేమిటి?"

"ముందు అప్పుచేశాననటానికి సాక్ష్యమేమిటి?" అన్నాడు అప్పారావు.

శాస్త్రి, శర్మ ముఖముఖాలు చూసుకున్నారు.

అవును—ఇంటాయన తమకు నోటులాంటిదేమీ ఇవ్వలేదు. ఏ నోటూ లేకుండా బాకీ ఎలా ఇస్తాడు ఆయనమాత్రం? ఆయన నిజంగా అప్పారావుకు అప్పిచ్చాడా? ఇస్తే నోటెందుకు ఇవ్వలేదు? అయినా బాకీ వసూలు చేసుకొస్తామని బయల్దేరిన తాము మాత్రం నోటు అడగలేదేమిటి? తామే మర్చిపోయినపుడు ఇంటాయన మర్చిపోవడంలో ఆశ్చర్యమేముంది? ఇప్పుడేం చేయాలి? వెళ్ళి నోటు తీసుకుని మళ్ళీ రావాలా? లేక....

"మిస్టర్ అప్పారావ్! చంద్రుడు వెన్నెల కాశాడనడానికి సాక్ష్యం అక్కర్లేదు. అలాగే మేము బాకీ వసూలుకు వస్తే - నువ్వు అప్పు చేశావనడానికీ సాక్ష్యం అవసరం లేదు" అన్నాడు శాస్త్రి.

"శుక్లపక్ష చంద్రుడిలా ఎగిరెగిరి పడుతున్నావు. కృష్ణపక్షంలోకి పంపేయగలను. కాస్త జాగ్రత్తగా వుండు—" అంటూ అప్పారావు భుజాలు కదిపి కండలు పొంగించాడు.

"అసలు నీ పేరే అప్పారావు. అప్పారావు అప్పులు చేస్తాడని మూళ్ళపూడి వెంకటరమణ అన్నాడు. ఆ సంగతి నీకు తెలుసా?" అన్నాడు శాస్త్రి మళ్ళీ.

"పోనీ—ఆ రమణగారింకా ఏమన్నారో చెప్పండి. అప్పారావు అప్పులు తీరుస్తాడుటా?"

అప్పారావు మాటలకు శాస్త్రి, శర్మ ఇద్దరూ కూడా ఆశ్చర్యపోయారు. శాస్త్రి నెమ్మదిగా—"నువ్వు పహిల్వాన్‌లా కనబడుతున్నావ్? నీకిన్ని తెలివి తేటలేమిటి—ఇది బాగోలేదు—" అన్నాడు.

"నాకు తెలివి తేటలెలా వచ్చాయో తెలుసుకోవాలనుంటే చెబుతాను. కానీ అందుకు పాతిక వేలు ఖర్చవు

తుంది. ఒప్పుకుంటారా?" అనడిగాడు అప్పారావు.

"ఒప్పుకోను. బాకీ ఇలా చెల్లగొట్టడానికి వీల్లేదు—" అన్నాడు శర్మ.

శర్మ మళ్ళీ బాకీ ఊసెత్తగానే అప్పారావుకు కోపం వచ్చింది. తనెవ్వరికీ బాకీ లేననీ మరోమాటు బాకీ అంటే మర్యాద దక్కదనీ అతను తీవ్రంగా హెచ్చరించాడు. అయినా శాస్త్రి, శర్మ మానలేదు. అప్పుడు అప్పారావు చిరునవ్వు నవ్వి—"పక్కింట్లో జంబులింగం వున్నాడు. నా బాకీ గురించి ఆయనతో ఓ పదినిముషాలు మాట్లాడండి. ఇక్కడేం జరిగిందో ఆయనకు చెప్పడం మర్చిపోకండి. ఆ తర్వాత మీకింకా సరదాగా వుంటే నా దగ్గరకొద్దురుగాని. ప్రస్తుతానికి వెళ్ళండి—" అన్నాడు.

శాస్త్రి, శర్మ జంబులింగం ఇంటికి వెళ్ళారు.

జంబులింగం సన్నగా ఊచలా వున్నాడు. మాట్లాడుతూంటే దగ్గుతాడేమోనని అనుమానం వస్తుంది. కానీ దగ్గడు. వంటికి తగ్గట్టే పిట్ట మొహం. మొహానికి తగ్గట్టే గుడ్లగూబ కళ్ళు.

"మీరు అప్పారావుగారితో దెబ్బలాడి వచ్చారా?" అనడిగాడు జంబులింగం శాస్త్రిరాగ్గా.

"మీకెలా తెలుసు?" శర్మ ఆశ్చర్యంగా అడిగాడు.

"తనతో దెబ్బలాడిన వాళ్ళనే ఆయన నా యింటికి పంపుతాడు...." అన్నాడు జంబులింగం.

"నువ్వు ఆయనకంటె మొనగాడివా?" అన్నాడు శర్మ.

"అబ్బే—అదేం కాదు. మా యింట్లోకి పరీక్షించి చూడండి. వీధిలో అన్ని దోమలూ, ఈగలూ వున్నాయి

గదా—మా యింట్లో ఎక్కడైనా ఒక్క ఈగైనా దోమైనా వున్నదేమో చూడండి—" అన్నాడు జంబులింగం.

శర్మ, శాస్త్రి కాస్త తీరుబడిగానే పరీక్షించారు. ఇంట్లో ఎక్కడా ఈగలు, దోమలు మచ్చుకి కూడా లేవు.

"అప్పారావు మా యింట్లోకి ఈగనూ, దోమనూ కూడా రానివ్వడు. అది ఆయన గొప్పతనం. ఆయన నీడలో నేను చాలా సుఖపడుతున్నాను. ఆయనకు తన్ను తాను పొగడుకోనడం ఇష్టముండదు. లేకపోతే తన గురించి తనే చెప్పుకోవచ్చు. ఆయన్ను పొగడాలంటే ఆదిశేషుడి వేయి నాల్కలూ చాలవు. నా నాలికే పాటిది?" అన్నాడు జంబులింగం పరవశంగా.

శాస్త్రి చిరాగ్గా—"నీ చిన్న మొహంలో నాలిక కూడా వుందా?" అన్నాడు.

జంబులింగం మొహం చిట్లించి — "వేళాకోళంగా వుందా — నాకు అప్పారావు రక్షణ వున్నది—" అన్నాడు.

"అప్పారావు రక్షణ నీకు కలకాలం కావాలంటే—అతణ్ని నువ్వు రక్షించుకోవాల్సి వుంది. మర్యాదగా మా బాకీ తీర్చేయమని అతడికి చెప్పు—" అన్నాడు శాస్త్రి.

జంబులింగం కోపంగా—"కోపం వస్తే అప్పారావు పచ్చిరక్తం తాగుతాడు తెలుసా?" అన్నాడు.

"కోపం రాకపోయినా మా రక్తం పచ్చిగావుండదు. అప్పుడప్పుడూ వేడిగా సలసల మరుగుతూ వుంటుందని అప్పారావుకు చెప్పు—" అన్నాడు శర్మ.

జంబులింగం ఇద్దరివంకా అదోలా చూసి—"మీ ధైర్యంచూస్తే మీకు కరాటే బాగా వచ్చునన్న అనుమానం కలుగుతోంది. అప్పారావుకూ కరాటేవచ్చు—" అన్నాడు.

"కరాటే వచ్చినా రాకపోయినా అప్పుతీర్చడం వస్తేచాలు...." అన్నాడు శాస్త్రి.

"మీరిక్కడే వుండండి—" అంటూ జంబులింగం ఓసారి పక్కింటికెళ్ళి అప్పారావుని కలుసుకుని మాట్లాడి వచ్చాడు. వెళ్ళేటప్పుడు నిరుత్సాహంగా వున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు హుషారుగా వున్నాడు.

"అప్పారావుగారు మిమ్మల్ని మళ్ళీ కలవడానికి భయపడుతున్నారు. ఆయనకు నరసరాజుగారు యాభై వేలివ్వాలి. ఆయన ఇవ్వడంలేదుట. ఆ యాభై వేలూ మీరు వసూలుచేసి తేగలిగితే అందులోంచి మీ పాతిక వేలూ ఇచ్చేస్తారుట. నరసరాజుగారి దగ్గర బాకీ వసూలు చేయడం అప్పారావుగారివల్లే కాలేదట. మీ రా బాకీ వసూలుచేసి పెడితే మీ మేలు జన్మకు మరిచిపోలేరుట" అన్నాడు జంబులింగం.

మిత్రులిద్దరూ ముందు తటపటాయించినా తర్వాత అంగీకరించి నరసరాజు వివరాలు తెలుసుకున్నారు. వారం రోజులపాటు వారికి ఘనమైన ఆతిథ్యమిచ్చే బాధ్యత జంబులింగం తీసుకున్నాడు.

3

ఇంటిదగ్గర అరుగుమీద కుర్చీలో ఓ మీసాల వ్యక్తి కూర్చుని వున్నాడు. శాస్త్రి, శర్మ అడ్రస్ చూసుకుంటూ ఆ యింటిని సమీపించి ఆ వ్యక్తిని చూసి—"అయ్యా నరసరాజుగారంటే తమరేనా?" అన్నారు.

సమాధానంగా ఆ వ్యక్తి పులిలా ఘాండ్రించి "నేను నరసరాజునెలా అవుతాను?ఆయన నా అన్నగారు. నేను పులిలా ఘాండ్రిస్తే ఆయన సింహంలా ఘర్జిస్తాడు—" అన్నాడు.

"మేమోసారి ఆయన్ను కలుసుకోవాలి?" అన్నాడు శాస్త్రి.

"ఎవరని చెప్పమంటారు?" అంటూ నరసరాజు తమ్ముడు లేచాడు.

"సర్కస్ వాళ్ళని చెప్పండి...." అంటూ శాస్త్రి, శర్మ మెట్లెక్కారు.

నరసరాజు తమ్ముడు లోపలకు వెళ్ళి కొంత సేపటికి ఓ వ్యక్తితో వీధిలోకి వచ్చాడు. అప్పటికి శాస్త్రి, శర్మ అరుగుమీద సిరపడ్డారు.

"నా పేరే నరసరాజు. మామూలుగా అయితే మిమ్మల్ని లోపలకు పిలిచివుండేవాణ్ని, కానీ మర్యాద తెలీనివాళ్ళను నేను వీధిలోనే కలుసుకుంటాను...." అన్నాడు నరసరాజు.

"నమస్కారమండి. పెద్దమనుషులకు అప్పిచ్చి అడగడం మర్యాదకాదని నాకూ తెలుసు. కానీ అప్పుచ్చుకుని అడిగించుకునేవాడు పెద్దమనిషి అనిపించుకుంటాడంటారా? మర్యాద ప్రస్తావన ఎలాగూ తెచ్చారు కాబట్టి అదే చూపించి — అప్పారావుగారికివ్వాల్సిన యాభై వేలూ ఇచ్చేయండి—" అన్నాడు శాస్త్రి.

"ఓహ్ — మిమ్మల్ని అప్పారావు పంపాడా? ఆ మాట ముందుగా చెప్పలేదేం? లోపలకు రండి డబ్బిచ్చేస్తాను...." అన్నాడు నరసరాజు. ఆయన ముఖంలోని

కోపం మాయమైపోయింది.

శాస్త్రి, శర్మ ముఖముఖాలు చూసుకుని తమలో గుసగుస లాడుకున్నారు. ఇదేదో దొంగ నాటకంలా గున్నదని వారిద్దరికీ అమానం వచ్చింది. అయితే యేం— కోట్లో తలదూర్చడం తమకు కొత్తకాదు కాబట్టి ధైర్యంచేసి ఇద్దరూ లోపలకు వెళ్ళారు. నరసరాజు వాళ్ళిద్దర్నీ ఓ గదిలోకి తీసుకువెళ్ళి కుర్చీల్లో కూర్చోబెట్టి మర్యాద చేశాడు. వాళ్ళకు కాస్త దూరంగా తనూ ఓ కుర్చీలో కూర్చుని — "మీకు ఎంత ఇవ్వాలన్నారు?" అన్నాడు.

"యాభై వేలు—" వినయంగా అన్నాడు శాస్త్రి.

"తమ్ముడూ — సరిగ్గా యాభై వేలుట లెక్కచూసి పట్రా—" అన్నాడు నరసరాజు గట్టిగా. గది బయట నుంచి—అలాగే అన్నయ్యా—అని వినబడింది. మరు క్షణంలో శాస్త్రి, శర్మల చేతులు, కాళ్ళు కుర్చీకి కట్టు బడిపోయాయి. మిత్రులిద్దరూ ఒక్కసారిగా-"మోసం!" అని అరిచారు.

"తమ్ముడూ—మోసం అంటే ఏమిటో ఒక్కసారి చూపించు...." అంటూ నరసరాజు గట్టిగా అరిచాడు. అలాగే అన్నయ్యా—అని గది బయటనుంచి వినబడింది. మరుక్షణం ఇద్దరి కుర్చీలూ గిరగిరా తిరగసాగాయి. అలా చాలా వేగంగా తిరుగుతున్నాయవి. నరసరాజు ఆ దృశ్యం చూస్తూ విరగబడి నవ్వసాగాడు. ఆయన నవ్వు తూంటే సింహం గర్జించినట్లుంది.

"ఆపు తమ్ముడూ!" అంటూ అరిచాడు నరసరాజు. కుర్చీలు తిరగడం ఆగిపోయింది.

"సర్కస్ ఎలాగుంది?" అన్నాడు నరసరాజు

వాళ్ళవైపు చూసి నవ్వుతూ. అయితే శాస్త్రి, శర్మ సమాధానం ఇచ్చే పొజిషన్లో లేరు. వాళ్ళకు ప్రపంచమంతా ఇంకా గిర్రున తిరుగుతున్నట్టే వుంది. వాళ్ళు మామూలు స్థితికి చేరుకోనడానికి కొంచెంసేపు పట్టింది. నరసరాజు ఓపిగ్గా వాళ్ళు తేరుకునేదాకా ఆగి-"సర్కస్ ఎలావుంది?" అని మళ్ళీ అడిగి — సింహగర్జన చేశాడు. అంటే నవ్వేడన్నమాట!

"సర్కస్ వాళ్ళు జంతువులకు శిక్షణ ఇచ్చేటప్పుడు అన్నీ ముందు తామే చేసి చూపిస్తారు. మేమూ అదే చేశాం. అంతే!" అన్నాడు శాస్త్రి.

నరసరాజు ఆశ్చర్యంగా వాళ్ళిద్దరివంకా చూసి "మీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి!" అన్నాడు.

"ధైర్యవంతులు కాబట్టే ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొంటాం. ఎవర్నీ ఎందులోనూ మోసం చెయ్యం. అందువల్ల దేవుడు ఎప్పుడూ మా పక్షాన్నే వుంటాడు-" అన్నాడు శర్మ.

"సరే—మీ చేత మళ్ళీ సర్కస్ చేయించాల్సి వుంటుంది. కానీ అవతల నాకింకా పనులున్నాయిగదా-అందాకా రెస్టుతీసుకోండి—" అంటూ నరసరాజు గది లోంచి వెళ్ళిపోయాడు. నరసరాజు ఆ గదిలోంచి వెళ్ళి పోయాక మళ్ళీ రెండు రోజులవరకూ ఎవరూ అక్కడ అడుగుపెట్టలేదు. శాస్త్రి, శర్మ ఇద్దరికీ తినడానికి తిండిలేదు. తాగడానికి మంచినీళ్ళు లేవు.

"ఇలా తిండీ తిప్పలూ లేకుండా పడి చావదల్చుకుంటే మన రూములోనే ఆ పని చెయ్యాల్సింది. అనవసరంగా ఇంత దూరం వచ్చాం. రూములో అయితే కాళ్ళూ, చేతులూ కదపడానికుండేది. ఇక్కడ అదీలేదు...."

అన్నాడు శర్మ.

"గాంధీగారు అన్నేసి రోజులు నిరాహార దీక్ష ఎలా చేసేవాడో కానీ నాకు మాత్రం ఈ రెండు రోజులకే ప్రాణం కడంటిపోయింది. చచ్చిపోతున్నానేమోనన్న అనుభూతి కల్గుతోంది——...." అన్నాడు శాస్త్రి.

"ఒకవేళ మనం చచ్చిపోయామేమో...." అన్నాడు శర్మ.

"చచ్చిపోతే మనం శవాలమయివుండాలి. ఆత్మలమైతే ఏ సంకెళ్ళూ బంధించలేవు. ఒకవేళ బంధించినా సంకల్పమాత్రాన విడిపోతాయి. పోనీ మనం ఆత్మలమే అనుకుందాం—ఈ సంకెళ్ళు విడిపోవుగాక...." అన్నాడు శాస్త్రి. అతడి నోటంట ఆ మాటలు రావడమే తడవుగా ఇద్దరికీ హఠాత్తుగా సంకెళ్ళు విడివడ్డాయి. మిత్రులిద్దరూ ఠక్కుమని కుర్చీల్లోంచి లేచిపోయారు.

"గురూ——కొంపతీసి మనం నిజంగానే ఆత్మలమై పోయామా?" అన్నాడు శర్మ.

శాస్త్రికి అంతా అయోమయంగా వుంది. ముందు కాళ్ళూ చేతులూ నొప్పి పెడుతున్నాయి. వళ్ళంతా నీరసం. ఇక్కణ్ణించి పారిపోవాలంటే వంట్లో శక్తి కావాలి. శక్తి కావాలంటే భోజనం కావాలి. ముందు మంచినీళ్ళు.

"మంచినీళ్ళు కావాలి!" అన్నాడు శాస్త్రి.

సరిగ్గా అప్పుడే శర్మ కళ్ళకు గది మూలగా వున్న వాష్‌బేసిన్ కనబడింది. అందులో కుళాయివుంది. కుళాయి లోంచి నీళ్ళు వస్తున్నాయి. ఇద్దరూ ముందు కడుపు నిండా నీళ్ళు పట్టించారు. కొంత శక్తి వచ్చినట్లయింది. అప్పుడు శర్మ——"మనం అనుకున్నవన్నీ జరుగుతున్నాయి

కాబట్టి ఆత్మలమనుకోవాలా? ఆకలిదప్పులు బాధిస్తున్నాయి కాబట్టి మనుషులమనుకోవాలా?" అన్నాడు.

"పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. మనం మనుషులమే. ముందా తలుపు దగ్గరకు వెళ్ళి ప్రయత్నిద్దాం. ఆత్మలమైతే తలుపులడ్డగించవు. కానీ మనని అడ్డగించవచ్చు—" అంటూ శాస్త్రి మిత్రుడితో గుమ్మంవైపు నడిచాడు. వాళ్ళు గుమ్మాన్ని సమీపించడమేమిటి? రెండు తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

శర్మ ఆశ్చర్యంతో నోరావలించాడు. ఎవరో అక్కడే వుండి తమను కనిపెడుతున్నారు. తమతో ఆడుకుంటున్నారు. మిత్రులిద్దరూ తటపటాయిస్తూ ముందడుగు వేశారు. ప్రమాదం పొంచి వున్నదనీ ఏ క్షణాన్నయినా అది మీద పడవచ్చుననీ ఇద్దరికీ అనిపిస్తోంది—అయినా చేయగలిగినదేమున్నది? ఇద్దరూ గుమ్మంలోకి వచ్చారు.

అప్పుడు చూశారు వాళ్ళు-పక్కనే వున్న వ్యక్తిని....

ఆ వ్యక్తి పదేళ్ళ బాలుడు!

"ఎవరు మీరు?" అన్నాడు ఆ అబ్బాయి వీళ్ళిద్దరి వంకా ఆశ్చర్యంగా చూస్తూ.

మిత్రులిద్దరికీ ఏం చెప్పాలో తెలియలేదు—"నువ్వెవరు?" అన్నాడు శాస్త్రి.

"నా పేరు రాము. సరసరాజుగారి మనవణ్ని. మా తాత నన్నెప్పుడూ ఇటువైపు రానివ్వడు. ఈ గదికున్న స్విచ్‌లు ముట్టుకోనివ్వడు. నాకిక్కడ ఆడుకోవడం సరదా. ఇప్పుడాయన ఇంట్లో లేడు. ఇలా ఆడుకుందుకు వచ్చాను. ఒకో స్విచ్ నే నొక్కుతున్నాను. ఓ స్విచ్ నొక్కేసరికి ఈ గది తలుపులు తెరుచుకున్నాయి. మీరు

బైటకు వచ్చారు—"

శాస్త్రి బుర్ర చురుగ్గా పనిచేసింది. భగవంతుడు రాముర్రూపంలో తమకు సాయం వచ్చాడు. ఈ సాయం ఉపయోగించుకోవాలి. అతను రామూవంక చూసి—

"నరసారాజుగారి స్నేహితులం. మేము ఇప్పుడే ఇక్కడికి వచ్చాం. పదినిముషాల క్రితం దాకా ఆయన ఇక్కడే వున్నారు. ఇప్పుడే వస్తానని బయటకు వెళ్ళారు. నువ్వేమో ఆయన ఇంట్లో లేరంటున్నావు..." అన్నాడు.

రాము బుర్ర గోక్కుని — "ఇంట్లోంచి బయల్దేరి గంటయింది. అయితే నాకు తెలీకుండా ఇలా వచ్చాడన్నమాట తాతయ్య. తాతయ్యకు నేనిటువైపు రావడం ఇష్టముండదు. ఎప్పుడూ ఇటువైపు రాకుండా ఎవరో ఒకరు కాపలా వుంటారు. ఇన్నాళ్ళకీవేళ నాకు అవకాశం దొరికింది. తాతయ్య ఇక్కణ్ణించే అలా బైటకు వెళ్ళిపోయుంటాడు...." అన్నాడు.

నరసరాజుది చాలా పెద్ద యిల్లు. వీధివైపు ఇంట్లో వాళ్ళెవ్వరూ మసలరు. వీధిలోంచి బాగా లోపలకు వెడితేనే—ఆడవాళ్ళు, పిల్లలు మసిలే ఆవరణ వస్తుంది. శాస్త్రి, శర్మ బంధించవలసిన ప్రాంతం వీధి గదిలోంచి కుడిపక్కగా వుంది. అది నరసరాజు ప్రత్యేకమైన ఆవరణ. అక్కడ ఇంట్లో వాళ్ళెవ్వరూ మసలరు.

"మీ తాతయ్య ఎక్కడికెళ్ళాడో నాకు తెలుసు. అక్కడ పిల్లలు చూడ్డానికి మంచి తమాషాలున్నాయి. మాతో వస్తావేమిటి?" అన్నాడు శర్మ.

రామును ఒప్పించడానికి వాళ్ళకు ఎంతో సేపు పట్టలేదు. ఇంట్లో ఎవ్వరూ చూడకుండా వీధిదారినే వాళ్ళు బయటకు వచ్చేశారు.

4

నరసరాజు, తమ్ముడు కలిసి ఇంటి గుమ్మం మెట్లెక్కుతూ—"నమస్కారమండీ—" అన్న పిలుపు వినబడి ఉలిక్కిపడి వెనక్కి తిరిగారు. వెంటనే వాళ్ళ ఉలికిపాటు ఆశ్చర్యంగా మారిపోయింది.

"మీరా?" అన్నాడు నరసరాజు ఆశ్చర్యంగా.

"చాలా సేపట్నించి మీ యింటిముందు కాపువేశాం. మీరు ఇప్పటికి వచ్చారు. త్వరగా యాభై వేలూ తెచ్చి చ్చేయండి. అవతల మాకు చాలా పనులున్నాయి—" అన్నాడు శర్మ.

"మీకింకా బుద్ధి రాలేదా?" అన్నాడు నరసరాజు ఆశ్చర్యంగా.

"సినిమాల్లోనూ, కథల్లోనూ కూడా మొదట్లో కష్టపడ్డా చివర్లో బుద్ధి తెచ్చుకునేది విలన్లే! మన సినిమాల్లోనూ, కథల్లోనూ వాస్తవికత ఎంతో చక్కగా ప్రతిబింబించబడుతున్నదని మేము నమ్ముతాం. కాబట్టి బుద్ధంటూ వస్తే అది మీకే రావాలి. మాకు కాదు—" అన్నాడు శర్మ.

"బాగా ఆలోచించి మంచి డైలాగే చెప్పావుగానీ—నా శిక్షల డోసు అలా అలా పెరుగుతూంటుంది. రెండోసారి మా చేత సర్కస్ చేయించానంటే మీరింక బ్రతికి బట్టకట్టలేరు—" అన్నాడు నరసరాజు.

"మీకింకా బుద్ధి రాలేదా?" అన్నాడు శాస్త్రి.

నరసరాజు పులిలా గాండ్రించాడు.

"అయ్యా—నరసరాజుగారూ—అప్పుడే మీ స్టేటస్ దిగిపోతోంది. ఇదివరలో సింహంలా గర్జించేవారు. ఇప్పుడు పులిలా గాండ్రిస్తున్నారు. ఇంకాస్సేపుపోతే

కుక్కలా మొరిగి ఆఖరికి పిల్లిలా మ్యావుమంటారు. లోపలకు వెళ్ళేక ఇంకా యాభై వేలూ తెచ్చి మాకివ్వాలనిపించక పోతే ఒక్కసారి మీ కోడలిగారిని—అమ్మా—రామూ ఏడీ అని అడిగి చూడండి. వాళ్ళ సమాధానం విని అప్పుడు పరుగున వచ్చి యాభై వేలూ తెచ్చి ఇచ్చేయండి" అన్నాడు శాస్త్రి.

"ఏమన్నావ్?" నరసరాజు చేతులు వణికాయి. అప్పటికి శాస్త్రి, శర్మ అరుగులమీద సెరపడ్డారు. "తమ్ముడూ, నువ్వు లోపలకు వెళ్ళి రాము గురించి అడిగిరా—నాకేదో భయంగా వుంది—" అన్నాడు.

తమ్ముడు అయిదు నిముషాల్లో బయటకు వచ్చి— "రామూ ఇంట్లో లేడు — ఎక్కడికైనా ఆడుకుందుకు వెళ్ళాడేమో—" అన్నాడు నరసరాజుతో.

"ఎక్కడికీ వెళ్ళలేదు. మా దగ్గర క్షేమంగా వున్నాడు. మీరు యాభై వేలు ఇచ్చేస్తే క్షేమంగా మీ దగ్గరకు చేరుకుంటాడు. లేదా ఎక్కడో సర్కస్ చేస్తూంటాడు—" అన్నాడు శాస్త్రి.

"అశుభం శుభం ఎరుగని పసివాణ్ని తీసుకుపోవడానికి మీకు చేతులెలా వచ్చాయి? వెంటనే వాణ్ని తీసుకురండి. లేకపోతే నేనేం చేస్తానో నాకే తెలియదు.." అన్నాడు నరసరాజు.

"మీరేం చేస్తారో మీకు తెలియదు. కానీ నేనేం చేస్తానో నాకు తెలుసు. మీకూ తెలుసు. ఆ విషయం గుర్తుంచుకుని యాభై వేల విషయంలో తొందరగా ఓ నిర్ణయం తీసుకోండి—" అన్నాడు శర్మ.

కాసేపు వారి నలుగురిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది.

"మిస్టర్స్ మీ పేర్లేమిటి?" అన్నాడు నరసరాజు.

"ఇప్పటికీ మా పేర్లడగాలని తెలిసింది మీకు—" అంటూ శాస్త్రి, శర్మ తమ పేర్లు చెప్పారు.

"మిస్టర్ శాస్త్రీ! ఒక్కసారిగా యాభై వేలు తేగల గొప్పవాడిని కాను నేను. నీకు రెండు చేతులూ జోడించి నమస్కరిస్తాను. నా మనుమణ్ని నాకు తెచ్చి యివ్వు. ఆ పసివాడు ఏం అగచాట్లు పడుతున్నాడోనని నా మనసు గిలగిలలాడిపోతున్నది. ప్లీజ్ మిస్టర్ శాస్త్రీ! నా మనుమణ్ని నాకు తెచ్చి యివ్వు...." అన్నాడు నరసరాజు.

ఆయన మాటలు ఆపి ఏడ్వ నారంభించాడు. శాస్త్రి ఆశ్చర్యపోయాడు.

"అయ్యా—నరసరాజుగారూ—చాకులాంటి కుర్రాళ్ళిద్దర్ని మోసం చేసి బంధించి కుర్చీలో కూర్చోబెట్టి గిరగిరా తిప్పి రెండు రోజులు తిండీ, నీళ్ళూ లేకుండా చేశారు. అప్పుడు మీ కంట ఒక నీటిచుక్కయినా చూడలేదు నేను. పదేళ్ళ మీ మనుమడికోసం కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చేస్తున్నారు. మేము మీవంటి రాక్షసులం కాము. కాబట్టి మీ మనుమడికి ఎలాంటి ఆపదా వుండదు. అయితే మీ కల్లబొల్లి ఏడ్పులకు కరిగి పోయి వచ్చిన పని మర్చిపోతామనుకోకండి. యాభై వేలు ఇచ్చితీరాల్సిందే—ఇంట్లోంచి తెచ్చిచ్చినా సరే—లేదా బ్యాంకుకు వెళ్ళి తెచ్చిచ్చినా సరే—" అని వాచీ చూసి "ఇంక బ్యాంకుకు అరగంట మాత్రమేవుంది. త్వర పడండి—" అన్నాడు శాస్త్రి.

"బ్యాంకుకు వెళ్ళి యాభయివేలు తేవాలంటే ఇప్పుడు లాభంలేదు. రాత్రిదాకా ఆగాలి. అదీ నా పరిస్థితి—" అన్నాడు నరసరాజు. ఆయన చూపులు దీనంగా

వున్నాయి. మీసాలు క్రిందకు వాలివున్నాయి.

"అలాంటప్పుడు అప్పారావుకు అంత డబ్బు ఎలా బాకీపడ్డారు?" అడిగాడు శాస్త్రి.

"ఆ ప్రశ్నకు జవాబు నేను చెప్పలేను. పోతురాజూ చెప్పాలి—" అన్నాడు నరసరాజు.

"పోతురాజా, వాడెవడు?" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"పోతురాజు నాకు లక్షరూపాయలు బాకీవున్నాడు. కానీ వాడది తీర్చడు. ఇమ్మని నేనూ అడగలేను. వాడు నా బాకీ తీరిస్తే నేను అప్పారావుగారి బాకీ తీర్చడం కష్టంకాదు సరిగదా క్షణాలమీద పని!" అన్నాడు నరసరాజు.

"మీ యింట్లో ఎలాంటివాడినైనా పట్టుకోగల ఏర్పాట్లున్నాయికదా — మీరు పోతురాజునెందుకు స్వాధీనం చేసుకోలేకపోయారు?" అనడిగాడు శర్మ.

"పోతురాజు గురించి ఎరిగిన వాళ్ళెవ్వరూ ఈ ప్రశ్న వేయరు—" అన్నాడు నరసరాజు.

"నాకు తెలియదు కాబట్టే నేనీ ప్రశ్న వేశాను. వాడి గురించి చెప్పండి—" అన్నాడు శర్మ.

"వాడి గొప్పతనం అనుభవించిన వాడికి గానీ తెలియదు. పగవాడికి కూడా వాడి గొప్పతనం అనుభవంలోకి రావాలని నేను కోరుకోవడంలేదు—" అన్నాడు నరసరాజు.

"మేమిద్దరం పోతురాజు దగ్గరకు వెళ్ళి మీ బాకీ వసూలుచేసుకువస్తాం. మీకు అభ్యంతరమా?" అన్నాడు శాస్త్రి.

"అభ్యంతరమే—అది నాకు ప్రమాదం. పోతు

రాజుకూ నాకూ గొడవ లేవద్దు మీరు—" అన్నాడు నరసరాజు.

"పోతురాజు మీకు బాకీ వున్నప్పుడు అడగడానికి మీకు భయమెందుకు?" అన్నాడు శాస్త్రి.

"అప్పారావు నా దగ్గర బాకీ వసూలు చేసుకోడానికి సాహసిస్తున్నాడా? ఇదీ అంతే—మహా సముద్రంలో చిన్న చేపలు పెద్ద చేపలకు దూరంగా వుండక తప్పదు. వ్యాపారస్తుడు తీసుకున్నది లాభం అంటారు. గవర్నమెంటు తీసుకుంటే పన్ను అంటారు. అవి అప్పులనరు. సాటివాడు తీసుకుంటేనే అప్పవుతుంది. పోతురాజు నాకు సాటివాడు కాదు—"

"మేమోసారి పోతురాజును కలుసుకోవాలి. వివరాలు చెప్పండి. మీ సంగతి వాడికి చెప్పంలెండి—" అన్నాడు శర్మ. నరసరాజు అయిష్టంగానే వాళ్ళకు కొన్ని వివరాలు చెప్పి తన ప్రసక్తి తీసుకురావద్దని వాళ్ళకు మరీమరీ చెప్పాడు. మనిషి బాగా బెదిరినట్లుగా కనబడ్డాడు.

5

అదొక చిన్న పెంకుటిల్లు. శాస్త్రి వెళ్ళి తలుపుతట్టి "పోతురాజుగారూ!" అని పిలిచాడు.

కొద్ది నిముషాల్లో యింటి తలుపులు తెరుచుకున్నాయి. సన్నగా పొట్టిగావున్న ఓ మనిషి తలుపుతీసి శాస్త్రివంక ఎగాదిగా చూసి—"ఎవర్నువ్వు?" అనడిగాడు.

"నా పేరు శాస్త్రి. నాకు పోతురాజుగారితో పని వుంది—" అన్నాడు శాస్త్రి.

"లోపలకురా— నేనే పోతురాజును—" అన్నాడా వ్యక్తి.

శాస్త్రి ఆశ్చర్యంగా లోపలకు వెళ్ళాడు. నరసరాజు

వంటి మనిషి నే గడగడలాడించిన ఆ పోతురాజు చాలా గొప్పగా వుంటాడనుకున్న అతడికి ఆశాభంగమయింది. నరసరాజింట్లో భంగపాటయ్యాక శాస్త్రి, శర్మ ఇద్దరూ ఒకేసారి కలిసి అనుమానాస్పదమైనచోట్ల చొరబడ కూడదనుకున్నారు. అందుకే దూరాన్నుంచి శర్మ కాపలా వున్నాడు.

ఇల్లు చాలా చిన్నది. వంటగది కాక రెండు గదు లున్నాయి. బాత్రూంలేదు. దొడ్లో నుయ్యి ఒకటి వున్నది.

"చాలా చిన్న యిల్లు!" అన్నాడు శాస్త్రి.

"నువ్వు వచ్చిన పనేమిటి?" అన్నాడు పోతురాజు.

"నాకో లక్షరూపాయలు అర్జంటుగా కావాలి—" అన్నాడు శాస్త్రి.

పోతురాజు తీక్షణంగా శాస్త్రివంక చూసి— "అప్పుగానా?" అన్నాడు.

"అప్పనుకున్నా సరే—బాకీ తీరుస్తున్నాననుకున్నా సరే—" అన్నాడు శాస్త్రి.

"నేను బాకీలు తీర్చను. కావాలంటే డబ్బు అప్పుగానే ఇస్తాను—" అన్నాడు పోతురాజు.

"నాక్కావలసింది ఒకటీ రెండూ కాదు. లక్ష రూపాయలు—" అన్నాడు శాస్త్రి నొక్కిస్తూ.

"ఒక లక్షేగా అన్నావు!" అన్నాడు పోతురాజు తేలిగ్గా తీసిపారేస్తూ—"నా దగ్గర చాలామంది సినిమా వాళ్ళు అయినా, పదికీ తక్కువకాకుండా తీసుకు వెడు తూంటారు. ఇంత తక్కువ మొత్తం అడిగినవాణ్ణి నిన్నే చూశాను—"

"నా ప్రాణానికి లక్షే ఎక్కువ. త్వరగా ఇయ్యి"—

అన్నాడు శాస్త్రి.

"నెలకు పదివేలు వడ్డీ కడుతుండాలి—అప్పు తీర్చేదాకా—" అన్నాడు పోతురాజు.

"చాలా దారుణంగా వుంది నీ వడ్డీరేటు-" అన్నాడు శాస్త్రి.

"ఇష్టమైతేనే తీసుకో—రెడీ క్యాష్ ఇస్తాను. అన్నీ అసలు నోట్లే!" అన్నాడు పోతురాజు.

"నువ్వు నన్నెరుగవుకదా — బాకీ ఎలా వసూలు చేస్తావ్?" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"పోతురాజుకు బాకీపడ్డాక ఇంక తెలియనివాడివెలాగౌతావ్? సప్త సముద్రాల అవతల దాగున్నా వెతికి తీసుకురాగలను. నా వసూలు బెంగ లేదు. నా పద్ధతులు నాకున్నాయి. ప్రతి నెలా ఇదే తేదీకి వడ్డీ మాత్రం నిఖార్సుగా కట్టేయాలి...." అన్నాడు పోతురాజు.

"అలాగే—" అన్నాడు శాస్త్రి.

పోతురాజు అతణ్ని ఓ గదిలో కూర్చోపెట్టి తను పక్క గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. ఓ అయిదు నిముషాల్లో అతను వంద రూపాయల నోట్ల కట్టలు తీసుకుని వచ్చి శాస్త్రిని లెక్కపెట్టమన్నాడు. అవి సరిగ్గా పదివున్నాయి. శాస్త్రి ఆనందంగా ఆ డబ్బు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

అప్పుడు పోతురాజు శాస్త్రికి ఒక ఫోటో తీశాడు. తర్వాత అతడి వేలిముద్ర తీసుకున్నాడు. ఆ తర్వాత చటుక్కున అతిడి భుజంమీద ఏదో గుచ్చాడు. శాస్త్రికి చురుక్కుమంది. "ఏమిటది?" అని అతడు అడిగాడు.

"నా జాగ్రత్తలైపోయాయి. ఇంక నువ్వు

ఎక్కడికైనా పోవచ్చు—" అన్నాడు పోతురాజు.

శాస్త్రి బైటకు వచ్చాడు. కొంతదూరంపోయాక శర్మ అతణ్ణి కలుసుకున్నాడు. శాస్త్రి అతడికి జరిగింది చెప్పి—"పోతురాజు వ్యవహారం చాలా తమాషాగా వుంది. చూస్తూండగా మనం లక్షాధికారులమైపోయాం" అన్నాడు.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు శర్మ.

"ఈ లక్షా తీసుకుని వెళ్ళి నరసరాజుకిచ్చేద్దాం—అందులోంచి యాభయివేలు తీసుకుని అప్పారావుకీ—అందులోంచి పాతికవేలు తీసుకుని మన ఇంటాయనకూ ఇచ్చి మన వాటా అయిదువేలూ వుంచుకుందాం—"

"బాగానే వుంది. మరి నెలనెలా పోతురాజుకు పది వేలు యిచ్చుకోవద్దూ?" అన్నాడు శర్మ.

"లక్షంటే అంత నిర్లక్ష్యంగా వున్నవాడికి అంతే కావాలి. మనం మళ్ళీ వాడికి కనబడొద్దు—"

"కానీ ఒకవేళ మనం పోతురాజునించి తప్పించుకోలేకపోతే?—" అన్నాడు శర్మ.

"ఇది అనుమానించదగ్గ విషయమే-అయితే పోతురాజు శక్తిసామర్థ్యాలు మనం తెలుసుకునే ఉపాయం ఒకటి వున్నది—అదేమిటంటే—ఇప్పుడే వెనక్కు వెళ్ళి—అయ్యా పోతురాజుగారూ—నేను కాస్త మతిమరుపు మనిషిని ప్రతిరోజూ ఏదో సమయంలో ఎన్నిరోజు లయ్యాయో మీరు నాకు కాస్త హెచ్చరిక ఇచ్చే ఏర్పాట్లు చేయండి—అని అడుగుతాను. ఆ తర్వాత ఓ వారం రోజులు మనమతన్ని తప్పించుకు తిరుగుదాం—మన్ని పట్టుకోలేకపోతే అప్పుడు దర్జాగా లక్ష రూపాయలు తీసుకుని నరసరాజు దగ్గరకు వెళ్ళొచ్చు—"

అన్నాడు శాస్త్రి.

అతను మళ్ళీ పోతురాజు దగ్గరకు వెళ్ళాడు. పోతురాజు అంతా విని—"రోజూ ఎన్నింటికి గుర్తుచేయమంటావ్ చెప్పు—బాగా ఆలోచించుకుని మరీ టైము చెప్పు. ఎందుకంటే ఆ టైముకి నువ్వు నిద్రపోతున్నా సరే లేపి మరీ గుర్తుచేయడం జరుగుతుంది. తర్వాత విసుక్కుని లాభంలేదు—" అన్నాడు.

"రాత్రి ఎనిమిది గంటలకు—" అన్నాడు శాస్త్రి.

6

జేబులో డబ్బు చేరింది. అందులో బాకీ వసూలు క్రింద పదిహేను వేలు తమ స్వంతం. శాస్త్రి, శర్మ హుషారుగా ఓ హోటల్లో మకాం పెట్టారు. అక్కడ గదిలో పూర్తిగా తమ వేషాలు మార్చుకున్నారు. ఇద్దరూ నడివయస్కులైన ముస్లిమ్స్‌లా తయారయ్యారు. తర్వాత హోటల్లోంచి బయటపడ్డారు.

ఆ వేషాల్లో వాళ్ళకి ఒకర్నొకరు గుర్తించుకోవడమే కష్టంగా వుంది. కాబట్టి పోతురాజు మనుషులు గుర్తిస్తారన్న బాధలేదు. అదీకాక పోతురాజు ఇల్లు వదిలినప్పట్నుంచీ జాగ్రత్తగా వున్నారు. ఎక్కడా ఎవ్వరూ తమ ననుసరించిన జాడలేదు. అందుకని ఇద్దరూ ధైర్యంగా హోటల్లోంచి బైటపడి మురికివాడవైపు వెళ్ళారు. ఆ ప్రాంతాల తాముంటామని ఎవ్వరూ ఊహించలేరని ఇద్దరూ అభిప్రాయపడ్డారు.

వాల్తేర్లో మురికివాడలకేం లోటులేదు. అయితే ఈ మురికివాడల ప్రత్యేకత ఏమిటంటే—అవీ మధ్యతరగతి ఇళ్ళలాగే వుంటాయి. ఒకవిధంగా చెప్పాలంటే అదీ సరైన మాటకాదు. వాల్తేర్లో కొన్ని కొన్ని ప్రాంతాల

మధ్యతరగతి ఇళ్ళనీ, మురికివాడల్నీ వేర్వేరుగా గుర్తించడం అసాధ్యం. ఆ గొప్పతనం మురికివాడలదో, మధ్యతరగతి ఇళ్ళదో చెప్పడం కష్టం.

శాస్త్రి, శర్మ—అలాంటి మురికివాడలో ఓ చిన్న ఇంటిముందాగి తలుపు తట్టారు. అది నేడో, రేపో కూలేలా వున్న ఇల్లు. బాగా పరీక్షించి చూస్తే అదొక పెంకుటిల్లు అని తెలుస్తుంది.

తలుపు తట్టగానే లోపల అలికిడి కావాలి. కానీ అలాంటిదేమీ జరగలేదు. కానీ రెండోసారి తలుపు తట్టడానికి శర్మ భయపడ్డాడు. "ఇవి తట్టవలసిన తలుపులు కావు. తాకవలసిన తలుపులు—" అన్నాడతను.

"ఇంట్లో ఎవరో వుండేవుండాలి. లేకపోతే ఇంటికి తాళం పెట్టి వుండేవారు—" అన్నాడు శాస్త్రి.

"ఈ యింటికి తాళమా—భలే జోకు...." అన్నాడు శర్మ.

శాస్త్రి బుర్ర పనిచేసింది—"అవును—ఈ ఇంటికి తాళం అక్కర్లేదు. ఈ తలుపుకు గడియమాత్రం అవసరమా — తలుపు కాస్త తోసిచూద్దాం—" అంటూ అతను నెమ్మదిగా తలుపు తోసే ప్రయత్నం చేశాడు. శర్మ అతణ్ని జాగ్రత్త జాగ్రత్త అని హెచ్చరించాడు. కానీ తలుపు సులభంగానే తెరుచుకుంది. అయితే అక్కడ దృశ్యం చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

అక్కడ ఓ ఇరవై ఏళ్ళలోపు యువతి నగ్నంగా నిలబడివుంది. సుమారు నలభై ఏళ్ళ మగాడు ఆమె వంటిని తుడుస్తున్నాడు—గుడ్డతో. ఇద్దరు కూడా వీళ్ళను చూసి ఉలిక్కిపడ్డారు. ఆ యువతి చటుక్కున కాస్త మూలగా వెళ్ళింది.

"ఎవరు మీరు? ఇక్కడికెందుకు వచ్చారు?" అన్నాడా మనిషి కోపంగా.

"తలుపు తట్టే వచ్చాం. కానీ మైకంలో మీకేమీ వినపడినట్లులేదు...." అన్నాడు శాస్త్రి ఆ మనిషిని పరీక్షించి చూస్తూ. ఆ మనిషి పరమ వికారంగానూ, బికారిలాగానూ వున్నాడు.

"వెళ్ళండిక్కణ్నించి—" అన్నాడా మనిషి.

"ఇక్కడేం జరుగుతోందో తెలుసుకుని మరీ వెడతాం—" అన్నాడు శర్మ.

ఆ మనిషి ఒప్పుకోలేదు. ఆ అమ్మాయి చదువుకున్న దానిలా వుంది. వీడు బిచ్చగాడిలా వున్నాడు. ఇక్కడిలా ఎందుకు కలుసుకుంటున్నారు? ఈ ప్రశ్నకు జవాబు దొరికేదాకా మిత్రులిద్దరూ అక్కణ్నించి కదలమని చెప్పేశారు.

"మేమిద్దరం ప్రేమించుకున్నాం—" అన్నాడా మగాడు.

"నేను నమ్మను. ఇందులో ఏదో తిరకాసుంది. నాలుగు తంతే నువ్వే నిజం చెబుతావు—" అంటూ శాస్త్రి చెయ్యెత్తాడు.

అరుపులూ, కేకలూ పెట్టడం ఆ బికారివాడికిష్టంలేదు-కాబోలు....త్వరగానే తమ కథ చెప్పాడు.

ఆ బికారి బికారికాదు. అదో వేషం. అతడు, ఆమె కూడా పరమ బికారి వేషంలో ఈ ఇల్లు చేరుకున్నారు. వారి దగ్గర జోలెలనిండా, చక్కని ఫోల్డింగ్ పరుపుతో పాటు ఎన్నో ఆధునిక శృంగార ఉపకరణ సాధనాలున్నాయి. వాటి సాయంతో ఇద్దరూ ఘుమఘుమ

లా దేలా తయారై ఓ గంటగడిపి వెళ్ళిపోతారుట. ఇద్దరూ ప్రేమికులు. అమ్మాయి మధ్యతరగతి కుటుంబీకురాలు. డబ్బు అవసరంలో వుంది. మగాడు ఊళ్ళో టాప్ లెవెల్ పెద్దమనిషి. వీళ్ళింటికి డబ్బు సాయంచేసి ఈ పిల్లను ఎవ్వరికీ తెలీకుండా రహస్యంగా అనుభవించడం వాడి ఉద్దేశ్యం.

“అది నేనేం చెబితే అది చేస్తుంది. దాని తల్లి చావు బతుకుల్లో వుంది. వైద్యం పేరు చెప్పి నెలకు అయిదు వేలుదాకా ఖర్చవుతుంది. రోజుల్లెక్కన రేటు కట్టినా నేనిచ్చేది ఎక్కువే! కానీ నేను వితరణ గలవాణ్ని. జాలిగుండె కలవాణ్ని. కాబట్టి అటు పుణ్యం, ఇటు పురుషార్థం చూసుకుని దీన్నిక్కడకు తీసుకొచ్చాను. ఒక్కరోజుకూ—కావాలంటే నా తర్వాత మీరు కూడా దాన్ని వాడుకోండి. కానీ నా రహస్యం దాచండి—” అన్నాడు బికారిలా కనబడే మగాడు.

“నువ్వలా కూర్చో—మమ్మల్ని ముందా అమ్మాయితో మాట్లాడనీ—” అన్నాడు శర్మ. శాస్త్రి అక్కడ పడివున్న మురికి గుడ్డల్ని మూటగా విసిరాడు. ఆ యువతి గబగబా బట్టలు వేసుకుంది. అప్పుడు శాస్త్రి ఆమెను సమీపించి — “నీకేం భయంలేదు. వాడంటే నీకు ఇష్టమేనా?” అన్నాడు.

“ఇష్టంలేదు. కానీ తప్పదు....” అన్నదా యువతి.

“మీ అమ్మకు వైద్యం జరుగుతుంది. నీకే ప్రమాదమూ వుండదు. ఆ బాధ్యత నాది. ఇంకా వాడంటే నీకిష్టమేనా?”

ఆ యువతి స్వరం తగ్గించి—“వాడి పేరు భూషణరావు. వాణ్ని కాదని ఈ ఊళ్ళో ఎవ్వరూ బ్రతకలేరు.

ఊళ్ళో పెద్దమనిషి. అందుకే నాలాంటి కన్నెపిల్లల్ని ఇలాంటిచోట్లకు తీసుకువస్తాడు. నా అదృష్టం కొద్దీ ఈ రోజే మీరొచ్చారు. ఈ రోజే మొదటిసారిగా వీడు నన్ను తీసుకుని వచ్చాడు—" అంది.

శాస్త్రికి ఆ మాటలు అంత నమ్మదగ్గవిగా తోచలేదు. అవకాశం రాగానే ఏ ఆడదైనా తను కన్నెపిల్లనని నమ్మించాలని చూస్తుంది. అయినా అంతకుమించి ఆమె మాత్రం ఏం చేయగలదు? అబల, అసహాయురాలు.... ఆడది! శాస్త్రి ఆమెని వదిలి భూషణరావు దగ్గరకువచ్చి "మిస్టర్ భూషణరావు నీ రహస్యం మాకు తెలిసి పోయింది—ఇకమీదట నువ్వీ పిల్ల జోలికి వెళ్ళకూడదు. వెళ్ళావో నీ బ్రతుకు బైటపెడతాం—" అంటూ శర్మ వైపు చూసి—"ఊఁ" అన్నాడు. వెంటనే శర్మ తన దగ్గరున్న మినీ కెమెరాతో భూషరావు మారువేషం ఫోటోలు విడివిడిగానూ, ఆ యువతితో కలిపీ కూడా తీశాడు.

"ఈ ఫోటోలు వాడే అగత్యం మాకు కలిగించకు—" అంటూ శాస్త్రి భూషణరావుని హెచ్చరించాడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక శాస్త్రి, శర్మ అక్కడే మకాం చేయాలనుకున్నారు. భోజన పదార్థాలు కూడా తెచ్చు కున్నారు. తినేసి కటిక నేలమీద నిద్రపోయారు. చాలా రోజులుగా అలిసిపోయి వున్నారేమో—ఇద్దరికీ ఒళ్ళు తెలియని నిద్రపట్టింది.

చీకటిపడిన కొంతసేపటికి ఆ యింటిముందు ఓ వృషభాయుడు ఆగాడు. అతడు చూడ్డానికి కాస్త భయంకరంగానూ, చాలా బలంగానూ వున్నాడు. ఆ ఇంటిముందు ఆగి చుట్టూ చూశాడతను. తటపటాయిస్తూ గుమ్మందాకా

వెళ్ళి తలుపు తోశాడు. నేలమీద పడుకునివున్న రెండు ఆకారాలు అతడికి కనిపించాయి. దృఢకాయుడు ఆ ఆకారాల్ని సమీపించి ఓ ఆకారంమీద చేయివేసి— "ఏయ్—ఏయ్—లే!" అన్నాడు.

ఆ ఆకారం ఓ పట్టాన లేవలేదు. దృఢకాయుడు చాలాసేపు కుదిపాడు. అతికష్టంమీద ఆ ఆకారం కళ్ళు విప్పి—"ఎవర్నువ్వు?" అన్నాడు.

"నేను పోతురాజు మనిషిని. వడ్డీ కట్టడానికింక నెల రోజుల్లో ఒకరోజు అయిపోయింది—" అన్నాడా వ్యక్తి.

శాస్త్రి ఉలిక్కిపడి — "శర్మా — లే!" అన్నాడు అప్రయత్నంగా.

శర్మ కూడా లేచాడు. దృఢకాయుడు ఆశ్చర్యంగా- "వేషం చూస్తే ముస్లిమ్స్‌లా వున్నారు. మీరు హిందువులా?" అన్నాడు. అప్పటికి శాస్త్రికి తను చేసిన పొరపాటు స్ఫురించింది—"మేము హిందువులం, ముస్లింలం—" అన్నాడతను గంభీరంగా.

"ఎవరతను?" అడిగాడు శర్మ.

"పోతురాజు వడ్డీ గురించి హెచ్చరించడానికి పంపాడు—" అన్నాడు శాస్త్రి.

"హెచ్చరికేకాదు. అన్న టైముకి డబ్బివ్వకపోతే వసూలు చేయాల్సింది కూడా నేనే!" అంటూ అతను చేతులు కదిపి కండలు పొంగించాడు.

"చాలా థాంక్స్—మీ మేలు మరువలేను—మనం మళ్ళీ రేపు కలుద్దాం—" అన్నాడు శర్మ. పోతురాజు మనిషి వెళ్ళిపోయాడు. మిత్రులిద్దరూ లేచి ళ్ళు మలుపుకుని—"ఇంకా ఈ వెధవింట్లో ఎందుకూ వుండడం.

ఇంక హోటలుకే పోయి వుండొచ్చు" అనుకుని అక్క-ణ్నించి కదిలారు.

7

నాలుగు రోజులుపాటు శాస్త్రి, శర్మ రకరకాల ప్రాంతాలు తిరిగారు. నాలుగు రోజులు కూడా రాత్రి అయ్యేసరికి పోతురాజు మనిషి శాస్త్రిని హెచ్చరించడం జరిగింది.

"మన్ని ఇంత తెలివిగా ఎలా నిఘా వేస్తున్నారో తెలియడంలేదు—" అన్నాడు శాస్త్రి.

"పోతురాజు అక్కడ నిన్నేంచేశాడో పూర్తిగా మరోసారి చెప్పు!" అన్నాడు శర్మ.

"నా ఫోటో తీసుకున్నాడు, నా వేలిముద్రలు తీసుకున్నాడు...." అని ఆగి...."అన్నట్లు దేంతోనో నన్ను గుచ్చాడు కూడా—చురుక్కుమంది నాకప్పుడు. అప్పుడు నేను దాన్ని గురించి అంతగా పట్టించుకోలేదు—" అన్నాడు శాస్త్రి.

"ఇంకేం-అర్థమయింది. ఇది సామాన్యమైన గ్యాంగు కాదు. చాలా పెద్ద గ్యాంగు. నీకు బహుశా హానిచేయని రేడియేషన్ డోస్ ఇచ్చివుంటారు. దాంతో నువ్వెక్కడున్నదీ సులభంగా ట్రేస్ చేస్తున్నారు. నీ ఫోటోవుంది. నీ వేలిముద్ర వుంది. నీ ఉనికి తెలుస్తుంది. ఇంకేం— నీకెంత అప్పయినా ఇవ్వగలరు వాళ్ళు—" అన్నాడు శర్మ.

"అయితే మనమిప్పుడేం చేయాలి? ఇంటాయన బాకీ వసూలవుతుంది, కానీ ప్రతీనెలా పదేసివేలు ఈ పోతురాజుకెక్కడ చదివించుకుంటాం!" అన్నాడు శాస్త్రి.

"అవును. ఇప్పుడేం చేయాలి? డబ్బు వెనక్కివ్వా

లన్నా కూడా మనం ఖర్చుపెట్టిందికాక ఇంకో పదివేలు జతపర్చి మరీ ఇవ్వాలి. లేనిపోని చిక్కు తెచ్చుకున్నాం" అన్నాడు శర్మ.

"మనకింకా నెలరోజులు టైముంది. ఈలోగా ఏదో ఉపాయం తోచకపోదు. దైవదర్శనం కోసం ఏదైనా పని చేయాలి. ఓసారి మనం రక్షించిన యువతిని కలుసుకుని వద్దామా?" అన్నాడు శాస్త్రి.

ఇద్దరూ ఆ యువతి ఇంటికి వెళ్ళారు. వీళ్ళు వెళ్ళిన సమయానికి ఆమె ఇంట్లోనే వున్నది. వీరిని చూస్తూనే ఆమె ఆప్యాయంగా ఆహ్వానించింది—"రండి—రండి మీ దయవల్ల మాకు బాగానే వుంది—" అన్నది.

"అల్లా మిమ్మల్ని చల్లగా చూస్తాడు—" అన్నాడు శాస్త్రి.

"మీ రెవరో తెలుసుకోవాలనుంది. వివరాలు చెబుతారా?" అన్నదామె.

"చెప్పడానికేముంది? ఎక్కడ ఆపదవుంటే అక్కడ ప్రత్యక్షమవుతూంటాం — ఎలాంటి ప్రమాదమైనా ధైర్యంగా ఎదుర్కుంటాం. ఎప్పుడూ విజయాన్ని సాధిస్తూంటాం—" అన్నాడు శాస్త్రి.

ఆమె తన పేరు సంధ్య అని చెప్పింది. వాళ్ళిద్దరికీ కాఫీలు కలిపిచ్చి—"నాకు హాస్పిటల్‌కు వెళ్ళే టయిమైంది. మీరు అన్యథా భావించవద్దు—" అన్నది.

"నీకు భూషణరావునించి ఎటువంటి ఇబ్బందీ కలగదు. కలిగితే మేము రక్షిస్తాం. అది చెప్పడానికే వచ్చాం. పెర్మనెంటు ఏర్పాటు జరిగేదాకా నిన్ను అప్పుడప్పుడూ కలుసుకుని వెడుతుంటాం—" అన్నాడు శర్మ.

మిత్రులిద్దరూ బైటకువచ్చేసరికి వారిముందు కారొకటి

ఆగింది. అందులోంచి ఇద్దరు యువకులు దిగి-"మేమెవరం అని అడగొద్దు. మీ మిత్రుడొకడు మీకోసం ఈ కారు పంపించాడు—" అన్నారు. శాస్త్రి, శర్మ తటపటాయించకుండా కారెక్కేసి—"మీరెవరూ అని మేమూ అడగం - మా మిత్రుడి దగ్గరకు తీసుకువెళ్ళండి—" అన్నారు.

కారు శరవేగంతో దూసుకుపోయి ఊరి చివర ఒక బంగళాముందు ఆగింది. కారులోనివారంతా ఆ బంగళాలో ప్రవేశించారు. అది విశాలమైన బంగళా-పది పన్నెండు దాకా గదులుండవచ్చు. దారి గజిబిజిగావుంది. ఓ గది ముందు ఆగారు. యువకులిద్దరూ కాలింగ్ బెల్ నొక్కారు. వెంటనే గది తలుపులు తెరుచుకున్నాయి. వాళ్ళు చటుక్కున శాస్త్రి, శర్మలను లోనికి తోశారు. తలుపులు మూసుకున్నాయి.

ఒక్క క్షణం పట్టింది మిత్రులిద్దరికీ - పరిస్థితి అర్థం చేసుకోవడానికి. అప్పుడు వారు గదిలో చూశారు.

గది పెద్దదే! వారికి ఎదురుగా ఓ సింహాసనంలాంటి కుర్చీవుంది. దాంట్లో భూషణరావు కూర్చుని వున్నాడు. అతణ్ని చూసి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఆ రోజానించీ మీకోసం చూస్తున్నాను. సంధ్య ఇంటి దగ్గర నా మనుషుల్ని కాపలా పెట్టాను. దానింటికి ఏదో ఒకరోజున మీరొస్తారని నాకు తెలుసు. ఇన్నాళ్లూ తప్పించుకున్నారు. ఈ రోజుతో మీకు మూడింది-" అన్నాడు భూషణరావు.

"మేమిద్దరం కలిసి తిరగడంవల్ల ఎన్ని లాభాలు. అంతా మమ్మల్ని మీరు.... మీరు....అని మన్నించేవాళ్ళే! ఆఖరికి మమ్మల్ని చంపాలనుకునే నువ్వుకూడా ....అందుకు

నాకెంతో ఆనందంగా వున్నది-" అన్నాడు శాస్త్రి.

"చావంటే మాకు భయంలేదు. ఎటొచ్చీ మమ్మల్ని చంపడం అంత సులభంకాదనుకుంటాను-" అన్నాడు శర్మ.

భూషణరావు చప్పట్లు కొట్టాడు. సింహాసనం వెనుక నుంచి నాలుగు వేటకుక్కలు పైకి లేచాయి. నాలుగూ సింహాన్నైనా చీల్చి చెండాడేలా వున్నాయి.

"సైన్సు ఎంతగానో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా నువ్వు ఇంకా పాత పద్ధతులు మానకపోవడం నాకెంతో విచారంగా వున్నది. ఇలా అయితే శత్రువులతో ఏం వేగగలవు? ఓ రెండు లక్షలు మాకిస్తే ఓ నెల్లాళ్ళపాటు నీకు మంచి శిక్షణ ఇవ్వగలం. మాతో వస్తావా?" అన్నాడు.

భూషణరావు మళ్ళీ చప్పట్లు కొట్టాడు. నాలుగు కుక్కలూ సింహాసనం ముందుకు వచ్చాయి.

"భూషణరావూ .... కుక్కలకు మామీదకు రావడానికి ధైర్యం చాలడంలేదు. అవి పూర్తిగా మామీదకు రావాలంటే నువ్వు అప్పుడప్పుడు చప్పట్లు కొడితే లాభంలేదు. రోజంతా భజన చేయాలి. ఏదో ఓ పేరున భజన చేయడం. నీకూ మంచిదే! చూడ్డానికి పాపాత్ముడిలాగున్నావు. అయితే భజన చేసిన నీకంటే భజన నీచేత చేయించినందుకు మాకే ఎక్కువ పుణ్యం వస్తుంది. అది మాత్రం గుర్తుంచుకో-" అని శాస్త్రి ఇంకా ఏదో అనబోతూండగా భూషణరావు మళ్ళీ చప్పట్లుకొట్టాడు. కుక్కలు ఒక్కసారిగా గాలిలోకి లేచాయి. అవి అలా గాలిలోకి లేవగానే శర్మ "య్యా-" అంటూ గట్టిగా అరిచాడు. అతడి రెండు చేతులూ మెరుపు వేగంతో కదిలాయి.

గాలిలోకి లేచిన కుక్కలు అలాగే క్రిందపడిపోయాయి.

భూషణరావు తెల్లబోయి కుర్చీలోంచి లేచాడు. అప్పటికి శాస్త్రి, శర్మ అతణ్ని సమీపించారు.

"ఏం జరిగింది?" అన్నాడు భూషణరావు నీరసంగా.

"నువ్వెప్పుడైనా బ్రూస్‌లీ సినిమాలు చూశావా? చూసివుండవు. చూస్తే మామీదకు వేటకుక్కల్ని ఉసిగొల్పివుండవు. బ్రూస్‌లీ సినిమాలో చేసిన ప్రతి పనీ మేము నిజ జీవితంలో చేయగలం. ఆ సంగతి తెలియక నాలుగు వేటకుక్కల్ని నష్టపోయావు. విషం పూసిన సూదుల్ని గురితప్పకుండా విసరగలగడం మా ప్రత్యేకత" అన్నాడు శర్మ.

భూషణరావు వాళ్ళిద్దరి వంకా భయంగా చూసి- "మీరు మనుషులుకారు...." అన్నాడు.

"మేము మనుషులమే-కానీ నువ్వు రాక్షసుడివి...." అన్నాడు శాస్త్రి.

"నా వేటకుక్కలు...." అన్నాడు భూషణరావు ఏడుపు గొంతుతో. తన శత్రువుల్ని క్రూరంగా శిక్షించి వినోదించడం భూషణరావు సరదా. ఈ వేటకుక్కల్ని ఇంతవరకూ ఎవ్వరూ ఏమీ చేయలేకపోయారు. వీటికి భయపడే ఎందరో ఆయనకు అణిగిమణిగి వుంటున్నారు. చాలా ఏళ్ళుగా అవాయన సేవలు చేస్తున్నాయి.

"వాటిని చూస్తూంటే అవే నీకు బలమనిపించింది. సాధారణంగా జంతు హత్య మాకు కిట్టదు. కానీ ప్రజా క్షేమంకోరి వాటిని చంపాల్సివచ్చింది. ఏమీ అనుకోకు" అన్నాడు శాస్త్రి.

శర్మ ఆ గదిలో వేటకుక్కలతో సహా భూషణరావును ఫోటోలు తీశాడు. గదిలో అయిదారు రహస్య బీరువా

లున్నాయి. అన్నింటినీ ఫోటోలుతీశాడు.

"నువ్వు చాలా పెద్ద స్మగ్లింగ్ కింగువి. ఈ రోజు మేమిక్కడికి రావడంవల్ల మంచిపని జరిగింది. నువ్వు మాకు మరింత గుప్పెట్లోకి వచ్చావు. ఇదీ మంచిదే.... సంధ్యను కన్న కూతురిలా చూసుకోకపోయావో - నీ బ్రతుకు బైటపడుతుంది-" అన్నాడు శర్మ.

"ఇంతకీ మనం మంచి మిత్రులంకదా - చెట్టాపట్టాలు వేసుకొని వీధిలోకి పోదాం-" అన్నాడు శాస్త్రి.

ముగ్గురూ ఒకరి భుజాలమీద ఒకరు చేతులేసుకున్నాక "నీ పాలిట వేటకుక్కలం మేము. నీకూ నీ కుక్కలగతి పట్టకూడదంటే బుద్ధిగా మమ్మల్ని వీధిలో దిగబెట్టు-" అన్నాడు శర్మ.

భూషణరావు, శాస్త్రి, శర్మ చెట్టాపట్టాలు వేసుకుని వీధిలోకి వెడుతూంటే హాల్లో వున్న యిద్దరు యువకులూ వారివంక ఆశ్చర్యంగా చూశారు.

8

"యాభయివేల రూపాయలు బాకీకింద, అయిదువేలు బాకీ వసూలుక్రింద వుంచుకున్నాం. ఇవిగో మీ నలభయి అయిదువేలూనూ. ఈ డబ్బు మేము పోతురాజు దగ్గర నుంచే తెచ్చాం. కానీ మీ పేరు చెప్పలేదు. అతడినుంచి మీకే ప్రమాదంలేదు-" అన్నాడు శాస్త్రి.

నరసరాజు ఆశ్చర్యంగా డబ్బు లెక్కపెట్టి- "నిజంగా అన్నంతపనీ చేశారు. మీ ఋణం ఎలా తీర్చుకోను?" అన్నాడు.

"మీకూ పోతురాజుకూ మధ్యనున్న కథేమిటో చెప్పాలి-" అన్నాడు శాస్త్రి-"అది మా చెవిని వేశారంటే రహస్యం భద్రంగా వుంటుంది...."

నరసరాజు నిట్టూర్చి—"యాభయి వేల రూపాయల్ని నాకు వసూలు చేసి పెట్టిన మీ రేదడిగినా చెప్పాలి. నేను ఒకప్పుడు అందరిలాగే బ్రతికేవాణ్ని. కానీ ఒకరోజున పోతురాజు మాయలోపడి ఓ పిల్లదానితో కక్కుర్తి పడ్డాను. వాడది ఫోటోతీసి నన్ను బ్లాక్ మెయిల్ చేసి నా దగ్గర్నుంచి అప్పుడూ అప్పుడూ చొప్పున అయిదేళ్ళలో యాభయి వేలు గుంజాడు. నేను వాడికి దణ్ణం పెట్టేశాను—ఇంక నా దగ్గర డబ్బులేదని. అప్పుడు వాడు నా ఆస్తిపాస్తులూ అవీ లెక్క వేసి - ఆఖరికో సలహా యిచ్చాడు. వాడి సలహా ప్రకారం మా యింట్లో ఓ గదిలో - ఇదివరలో మిమ్మల్ని బంధించిన కుర్చీలూ, రహస్యపు తలుపులూ ఏర్పాటు జరిగింది. పోతురాజు తన శత్రువుల్నిక్కడికి పంపుతూంటాడు. వాళ్ళను నేను తెలివిగా ఆ గదిలోకి లాక్కుపోయి శిక్షించాలి. అదీ ఏర్పాటు. అయితే అగ్రిమెంటు అంతటితో అయిపోలేదు. పోతురాజు తన దగ్గరున్న కొన్ని బ్లాక్ మెయిలింగు కేసులు నాకు అప్పగించాడు. నా డ్యూటీ ఏమిటంటే డబ్బు వసూలు చేసి పోతురాజుకివ్వడం. అంటే నేనతడి ఏజంటునన్నమాట. అయితే నేను కమిషన్ లేని ఏజంటుని. చాలా కాలంగా నాకు నచ్చనిపని చేస్తున్నాను. అప్పారావుని బ్లాక్ మెయిల్ చేసి యాభయి వేలు వసూలు చేసి పోతురాజుకిచ్చాను...."

"అప్పారావేం పాపం చేశాడు?"

"ఈ ప్రపంచంలో పట్టుబడనివాళ్ళే తప్ప పాపాలు చెయ్యనివాళ్ళు లేరు. అప్పారావు ఆస్తికోసం వీలునామా ఫోర్జరీ చేశాడు. అది పోతురాజు కనిపెట్టాడు...." అన్నాడు నరసరాజు.

"పోతురాజు పద్ధతి నాకు నచ్చింది. పాపాత్ములని ఆతడు ఈ లోకంలోనే శిక్షిస్తాడు. ఆ విధంగా పాపులకు నరకంలో కొంత శిక్ష తగ్గుతుంది. సరే మీరు కమిషన్ లేని ఏజంటుగా అతడికి పని చేస్తూ వుండండి. మరి మేము సెలవు తీసుకుంటాం" అంటూ శాస్త్రి అక్కణ్నించి బైటకు దారితీశాడు.

బైటకు వచ్చేక శర్మ-"పాపం ఆ నరసరాజుని చూస్తే జాలేస్తోంది. ఆయనకు సాయపడదామా-" అన్నాడు.

శాస్త్రి శర్మవైపు చిరాగ్గా చూసి-"నీకు గుర్తుందా? మనల్ని కుర్చీల్లో కూర్చోబెట్టి హింసించినరోజున నరసరాజు ముఖం ఎలావుంది? అపురూపమైన దృశ్యం చూస్తున్న వాడిలాగుంది? మనం కళ్ళు తిరిగి మెడలు వాల్చేస్తే ఆయన ఎంతో ఆనందంగా నవ్వాడు. అదే మనిషి తన మనుమణ్ని మనం బంధించామనేసరికి ప్రపంచంలోని దీనత్వమంతా సంతరించుకున్నాడు. ఎదుటివాడి కష్టాలకు ఆనందించి, తన కష్టాలు భరించలేనివాళ్ళు మహా క్రూరులు. ఆ నరసరాజుకు పోతురాజు తగిన శిక్షే ఇస్తున్నాడు. నాకు చాలా సంతోషంగావుంది. దేవుడు ఈ ప్రపంచంలో అన్నీ బ్యాలన్సు చేస్తాడు. మనం యాభయివేలివ్వడమే నరసరాజుకో పెద్ద ఉపకారం..." అన్నాడు.

తర్వాత ఇద్దరూ అప్పారావు ఇంటికి వెళ్ళి ఇరవైవేలూ ఇచ్చేసి-"మిగతాది మా బాకీకింద, వసూలుకింద జమ కట్టుకుంటున్నాం. మీకు అంగీకారమే కదా!" అన్నారు.

"గోడకు వేసిన వెల్ల తిరిగొస్తుందని నేనెప్పుడూ

అనుకోలేదు. మీరు మహానుభావులు. మీ చేతులమీదుగా నాకు లభించిన ఈ డబ్బు మహాప్రసాదం——....” అన్నాడు అప్పారావు.

ఇద్దరూ రూం చేరుకుని కాసేపు నిద్రపోయారు. నిద్ర లేచాక కాసేపు జరిగిన కథంతా ఒకరికొకరు చెప్పు కున్నారు. అప్పుడు శర్మ - “అన్నట్లు నీ ఆకలి వేయడం లేదూ-” అన్నాడు.

“అవును. రూంలోనే భోజనం తెప్పించుకుందాం-” అన్నాడు శాస్త్రి.

మంచం పక్కనే వున్న సర్వీసింగ్ మీట నొక్కాడు శాస్త్రి. తక్షణం కాలింగ్ బెల్ మ్రోగింది.

“ఈ హోటల్లో సర్వీస్ చాలా బాగుంది. ఎప్పు డొచ్చినా ఇక్కడే దిగాలి!” అన్నాడు శర్మ. అతనే లేచివెళ్ళి తలుపుతీసి వులిక్కిపడ్డాడు.

ఎదురుగా పోతురాజు మనిషి వున్నాడు. అతను లోపలకి వచ్చి - “వడ్డీ కట్టడానికి మీకు ఇంక ఇరవై నాలుగు రోజులు మాత్రం వున్నది—” అన్నాడు శాస్త్రితో.

“నాయనా-నన్నిలా హెచ్చరించడానికి నీకు రోజుకు ఎంత ముడుతుంది?” అన్నాడు శాస్త్రి.

“టైము ఎనిమిదయింది——” అని ఆ మనిషి వెళ్ళి పోయాడు. ఆ తర్వాతనే గదిలోకి బేరర్ వచ్చాడు. మిత్రులిద్దరూ రెండు భోజనాలు ఆర్డరిచ్చారు. బేరర్ వెళ్ళిపోయాడు.

“పోతురాజు విషయం మనం సీరియస్‌గా తీసు కోవాలి-” అన్నాడు శర్మ.

"అవును. ఈ విషయమై మన మోసారి భూషణరావును కలుసుకోవాలి—" అన్నాడు శాస్త్రి సాలోచనగా.

9

"మనం మంచి మిత్రులం-" అన్నాడు శర్మ.

"అవును...." అన్నాడు భూషణరావు నీళ్ళు నములుతూ.

"మానుంచి మీకు ఎటువంటి అపకారమూ జరుగదు. ఎటొచ్చీ మీరు మాకిచ్చిన మాటకు కట్టుబడి వుండాలి. ఆ తర్వాత చిన్న సాయం చేయాలి-" అన్నాడు శాస్త్రి.

"సాయమా? నేను మీకు సాయమా?" అన్నాడు భూషణరావు.

"అవును. ఈ ఊళ్ళో ఓ స్నేహితుడికి ప్రతి నెలా పదివేలిస్తామని మాటిచ్చాం. మాటిచ్చామంటే ఉత్తినే ఇవ్వలేదు-మీ ధైర్యం చూసుకునే ఇచ్చాం-.." అన్నాడు శాస్త్రి.

"పదివేలా — ఇటీజ్ టూ మచ్ —" అన్నాడు భూషణరావు.

"అలాగనే మేమూ అనుకున్నాం. కానీ మా స్నేహితుడు పోతురాజు వినడంలేదు. ఇందుకో ఉపాయం కూడా వుంది. నిజానికి అతడివద్ద మేము లక్షరూపాయలు మాత్రమే తీసుకున్నాం. అతడు నెలకు పదివేలు వడ్డీ అన్నాడు. అవసరానికి లక్ష ఇచ్చిన వాడామాత్రం వడ్డీ అడగడం తప్పులేదుకదా అని ఒప్పుకున్నాం. ఏ నెలనుంచి పదివేలు ఇవ్వక్కర్లేదనుకుంటే ఆ నెలకు లక్షా పదివేలూ ఇచ్చేస్తే ఆ బాకీ శాశ్వతంగా చెల్లుబడి అయిపోతుంది....మీ యిష్టం....మీరెలా చేసినా సరే."

"పోతురాజు మీకు డబ్బిచ్చాడా? అతను డబ్బిస్తాడని ఎంతోమందికి తెలియదే?" అన్నాడు భూషణరావు ఆత్రుతగా. శాస్త్రి, శర్మ మరింత అసాధ్యులని ఆయనకు అనుమానం కలిగింది.

"పోతురాజు సంగతి మీకూ తెలుసా?" అన్నాడు శాస్త్రి.

"నాకు తెలియడమేమిటి? అతను నా మనిషే - తన దగ్గరకు వచ్చి అడిగిన ప్రతివారికీ ఎంత కావాలంటే అంత అప్పిస్తాడు పోతురాజు. వడ్డీ పదిశాతం. ఎటొచ్చీ ఏడాదికి కాదు నెలకు. లాభాల్లో ఒక శాతం మాత్రమే అతనిది. అయినా ప్రతి నెలా వేలకు వేలు సంపాదించుకుంటాడు. కానీ పోతురాజు గురించి సమాచారం అందరికీ తెలియదు. మీరు నిజంగా అసాధ్యులు...." అన్నాడు భూషణరావు.

"అడ్డమైనవాళ్ళకి అప్పిస్తే బాకీ వసూలు ఎలా గౌతుంది?-" అన్నాడు శర్మ.

"వసూలుకు పోతురాజు దగ్గర ఎన్నో పద్ధతులున్నాయి-" అన్నాడు భూషణరావు.

"అతడివద్ద పద్ధతులుండొచ్చు. కానీ పుచ్చుకున్నవాడు పాపర్ అయితే—....?" అన్నాడు శర్మ.

"సైన్సు బాగా అభివృద్ధి చెందింది. ఫ్రెష్ గుండె కాయను ఏ ట్రాన్స్ప్లాంటేషన్ ఆపరేషన్ కైనా సరఫరా చేయగలిగితే ఆదాయం లక్షల్లో వుంటుంది. మనిషి శరీరంలో కళ్ళు, ముక్కు, చెవులు, ఎముకలు, ఊపిరితిత్తులు, కాలేయం....ఒకటేమిటి? అన్ని భాగాలకూ డిమాండ్ పెరిగివున్న ఈ రోజుల్లో—మానవ శరీరంతో లక్షలు

సంపాదించడం పెద్ద కష్టంకాదు. బాకీ వసూలు మాకో సమస్యకాదు....” అని—“నా రహస్యాలు శాస్త్రి ఎక్కువగానే మీముందు బయటపెడుతున్నాను. కారణం తెలుసా?” అన్నాడు.

“మమ్మల్ని మళ్ళీ చంపాలని పథకం వేశావా?” అన్నాడు శాస్త్రి.

“అబ్బే — అలాంటిదేమీ లేదు. మిమ్మల్ని నాతో కలుపుకుందామని. మీరు నాతో చేతులు కలపకూడదా-సరదాగా — ఈ ప్రపంచాన్నే ఓ ఆట ఆడిద్దాం!” అన్నాడు భూషణరావు.

“మేము ఎవరితోనూ చేతులు కలపం. మేము చేతులు కలిపితే గట్టిగా చప్పుడవుతుంది. దొంగలు చప్పుడు చెయ్యకూడదు. నిశ్శబ్దంగా వుండాలి. కాబట్టి దొంగలు మాతో చేతులు కలపాలని అనకూడదు. కాబట్టి ఆ విషయమలా వదిలిపెట్టి—ముందు పోతురాజు సంగతి తేల్చు—” అన్నాడు శాస్త్రి.

భూషణరావు పోతురాజును రప్పించి బాకీ చెల్లుబడి చేయించేశాడు.

“పాపం మీకు లక్షరూపాయలు నష్టం—” అన్నాడు శర్మ జాలిగా.

“ఏమీ నష్టంలేదు. లక్షల విలువచేసే మీ పరిచయం లభించింది. ఏదో ఓ రోజున మనం చేతులు కలపకపోము. మీవల్ల నాకు ఇంతకింతా లాభం రాకపోదు —” అన్నాడు భూషణరావు.

10

ఇంటాయన మళ్ళీ మళ్ళీ లెక్కపెడుతూ—“లెక్క బాగా సరిపోయింది. అంతా సరిగ్గావుంది....” అని పది

సార్లు అన్నాడు.

శాస్త్రి, శర్మ ఆయన దగ్గర సెలవు తీసుకున్నారు.

ఇంటాయన—"ఈ కుర్రాళ్ళు అఖండుల్లాగున్నారు. పాతిక వేలంటే పాతిక వేలు బాకీ ఇట్టే వసూలు చేసుకొచ్చారు...." అన్నాడు భార్యతో.

"అవునూ — అందులో అయిదు వేలు వాళ్ళకెందుకిచ్చారు? అసలే వాళ్ళు మనకు అద్దెకూడా సరిగ్గా ఇవ్వడంలేదు. మీరు వాళ్ళకు ఎదురిస్తే ఇంకా లోకువగా ఉండమూ—అయినా డబ్బంత చేదుగా వుందా మీకు?" అంది ఇంటాయన భార్య.

"బాగుందే — ఈ కుర్రాళ్ళు దుడుకు మనుషులు. ఇంటద్దె ఇవ్వరు. వీళ్ళనెలా వదుల్చుకుందామా అని చూస్తున్నాను. విశాఖపట్నంలో అప్పారావని ఒకడున్నాడనీ — వాడు పట్టపగలు నడిబజార్లో హత్యలు చేయగలడనీ ఎవరో అంటే వాడు నాకు బాకీవున్నాడని అబద్ధం చెప్పి—లేని బాకీ వసూలుకు వీళ్ళని పంపించాను. వాడి చేతిలో వీళ్ళు ఏదో అయిపోతారనే అనుకున్నాను. కానీ వీళ్ళు నా బాకీ వసూలు చేసుకుని వచ్చారు. ఎలా వసూలు చేశారో, ఏమిటో?... ఇరవై వేల రూపాయలు... ఎన్నేళ్ళుంటే మాత్రం అద్దెకింద ఇది తీరుందో నువ్వే చెప్పు...." అన్నాడు ఇంటాయన.

ఇంటాయన భార్య వెర్రి ముఖంవేసుకుని—"ఇరవై వేలు....వుత్తినే వచ్చాయా?" అంది.

హుషారుగా రోడ్డుమీదకు వెళ్ళిన శాస్త్రి, శర్మ ఏదో సందేహం వచ్చి మళ్ళీ వెనక్కు వెళ్ళాలనుకుని మానేశారు. అదే మంచిదయింది. లేకుంటే ఈ సంభాష

ణంతా వాళ్ళు విని - అసలు అప్పారావు, నరసరాజుల బాకీల విషయాలు కూడా ఎంతవరకూ నిజం - అని మథనపడిపోయేవారు.

ఈ సంగతి భూషణరావుకు తెలిస్తే! వున్న బాకీలు వసూలు చేసే పోతురాజునే ఆయన ఆకాశానికేస్తున్నాడు. లేని బాకీలు వసూలు చేసే వీళ్ళ సంగతి తెలిస్తే ఆయన ఏమంటాడో?

—: అయిపోయింది :—